

రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6.24 సోమవారం సాయంత్రం
సహరి: 4.42 మంగళవారం ఉదయం

31 వరకు గోదావరి డెల్టాకు నీటి విడుదల 7



వేస్ట్.. కాదు సుమా!



ఈ నెల 8న కాపవరంలో పరిశీలించిన మంత్రి నారాయణ

చెత్తతో విద్యుత్ వెలుగు

- చెత్త నుంచి విద్యుదుత్పత్తి
- రూ.370 కోట్లతో ప్లాంట్
- బిక్కవోలులో ఏర్పాటుకు ఓకే
- టెండర్లు పిలిచిన సర్కారు
- ప్రైవేటు భాగస్వామ్యంతో నిర్వహణ
- 22 మునిసిపాలిటీల నుంచి చెత్త
- ఉభయగోదావరి జిల్లాలకు ఇక్కడే
- రోజుకు 950 టన్నులు
- 12 మెగావాట్ల విద్యుదుత్పత్తి
- ప్రజల తీవ్ర అభ్యంతరం
- గ్రాసిం పరిశ్రమతోనే ఇబ్బందులు

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా అనేక మునిసిపాలిటీల్లో వందల టన్నుల చెత్త సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా కూటమి ప్రభుత్వం సరికొత్త అడుగులు వేస్తోంది. నిత్యం వచ్చే వందల టన్నుల చెత్తను ఒక చోటకు చేర్చి దీని నుంచి విద్యుదుత్పత్తి చేసే ప్రాజెక్టుకు రూపకల్పన చేస్తోంది..అటు జనానికి చెత్త సమస్య తీర్చడం..ఇటు కొండల్లా పోగయ్యే చెత్తను కనుమరుగు చేసి ప్రజలకు ఉపయోగపడేలా విద్యుదుత్పత్తి చేసేలా రూ.370 కోట్లతో చెత్త నుంచి విద్యుత్ తయారీ యూనిట్ నెలకొల్పబోతోంది. కాకినాడ-రాజమహేంద్రవరం క్లస్టర్‌లో దీని ఏర్పాటుకు వీలుగా ప్రైవేటు సంస్థలను ఆహ్వానించింది. అనపర్తి నియోజకవర్గంలోని బిక్కవోలు మండలం కాపవరం, బలభద్రపురంలో గ్రామాల్లో ప్రాజెక్టుకు స్థలాలు గుర్తించడంతో ఇప్పుడు కొత్త సమస్య వచ్చి పడింది. ఇప్పటికే ఇక్కడ జనం గ్రాసిం కంపెనీ కాలుష్యంతో ఇబ్బంది పడుతుంటే చెత్తంతా ఇక్కడకు తేవడం సరికాదని స్థానిక ఎమ్మెల్యే నల్లమిల్లి, అటు జనం వ్యతిరేకిస్తున్నారు. పెద్దాపురంలో స్థలం అనువుగా ఉన్నా ఎందుకు ఇక్కడే అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రోజుకు 950 టన్నుల చెత్త..

ఉమ్మడి తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల్లో 22 కార్పొరేషన్లు, మునిసిపాలిటీలను కలిపి కాకినాడ- రాజమహేంద్రవరం క్లస్టర్‌గా ప్రభుత్వం ప్రతిపాదించింది. కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల్లో కార్పొరేషన్లు, మునిసిపాలిటీలు 12 ఉన్నాయి. ఉభయ గోదావరి జిల్లాల్లో కలిపి రోజుకు 950 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతుంది.అత్యధికంగా ఉమ్మడి తూర్పు నుంచి ఉత్పత్తి అవుతుంది. కాకినాడ కార్పొరేషన్‌లో రోజుకు 144 టన్నులు, రాజమహేంద్రవరం కార్పొరేషన్ 160, పిఠాపురం 26, పెద్దాపురం 25, సామర్లకోట 23, రామచంద్రపురం 23, మండపేట 26, ముమ్మిడివరం 11,అమలాపురం మునిసిపాలిటీలో 30,కొవ్వూరు, నిడదవోలు మునిసిపాలిటీల పరిధిలో టన్నుల కొద్దీ చెత్త రోజువారీ వస్తోంది.ఈ చెత్తం టినీ ఒక చోట చేరిస్తే రోజుకు 12 మెగా వాట్ల విద్యుదుత్పత్తి చేయవచ్చని అధికారులు తేల్చారు.

ప్లాంట్ ఖర్చంతా ప్రైవేటుదే..

12 మెగావాట్ల విద్యుదుత్పత్తి ప్లాంట్‌కు రూ. 370 కోట్ల వరకు ఖర్చవుతుంది. ఒక్క పైసా పెట్టుబడి పెట్టకుండా ప్రైవేటు కంపెనీయే భరించేలా ఇటీవల ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.ఈ మేరకు టెండర్లు పిలిచింది. ఎంపికైన సంస్థ ఈ మొత్తం భరిస్తే ప్రభుత్వం తరఫున చెత్త ఇవ్వడం, ఉత్పత్తయిన విద్యుత్ 25 ఏళ్ల పాటు సదరు కంపెనీయే సొంతంగా విక్రయించుకునే వెసులుబాటు కల్పించింది. ప్రభుత్వానికి ఏ మాత్రం భారం లేకుండా రెండు కార్పొరేషన్లు, 10 ముని సిపాలిటీల్లో చెత్తంతా బయటకు వెళ్లిపోనుంది.ఈ ప్రాజెక్టు అరంభమైతే 22 కార్పొరేషన్లు, మునిసి పాలిటీల్లో చెత్త సమస్యకు చెక్ పడనుంది.ఈ ప్రాజెక్టుకు అనపర్తి నియోజకవర్గం బిక్కవోలు మండలం కాపవరంలో 12 ఎకరాలు,బలభద్రపురంలో 20 ఎకరాలను అధికారులు ఎంపిక చేశారు.12 ఎకరాల్లో విద్యుత్ ప్లాంట్, 20 ఎకరాల్లో చెత్తంతా వేసి విద్యుదుత్పత్తికి అనువుగా మార్చడం చేయనున్నారు.ఈ నెల 8న మునిసిపల్ శాఖ మంత్రి నారాయణ కూడా ఆ ప్రాంతాన్ని పరిశీలించారు.

ప్రాజెక్టుపై వ్యతిరేకత..

ప్రతిపాదిత ప్రాజెక్టు ప్రదేశంపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.కాపవరం, బలభద్రపురం గ్రామాల్లో 22 కార్పొరేషన్లు, మునిసిపాలిటీల నుంచి తెచ్చిన చెత్తంతా వేస్తే జనం ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతింటుందని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ఊరు చుట్టూ వందల్లో చెత్త లారీలు తిరిగితే జనం ఇబ్బందులు పడతారని అంటున్నారు. ఇప్పటికే గ్రాసిం పరిశ్రమ కాలుష్యంతో నరక యాతన పడుతున్న జనానికి ఇది మరో ముప్పు అని ధ్వజమెత్తుతున్నారు. అటు చెత్త నుంచి విద్యుదుత్పత్తి ప్లాంట్ ఏర్పాటు చేయవద్దంటూ కాపవరం, బలభద్రపురం పంచాయతీలు సైతం ఏకగ్రీవ తీర్మానం చేశాయి. ఈ ప్రాజెక్టుకు అనువైన భూమి పెద్దాపురంలో గుర్తించిన అధికారులు మళ్లీ బిక్కవోలు వైపు చూడడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కాపవరం,బలభద్రపురానికి సమీపంలో చెత్త నుంచి తయారయ్యే విద్యుత్ గ్రిడ్‌కు అనుసంధానించుకునేలా విద్యుత్‌లైన్ ఉండడం వల్ల మొగ్గుచూపుతున్నట్టు అధికారులు చెబుతున్నారు.

27న ఉపసర్పంచ్‌ల ఎన్నిక

- 35 పంచాయతీల్లో ఖాళీలు
- ఉమ్మడి జిల్లాలో ఇదీ లెక్క
- పల్లెల్లో ఎన్నికల సందడి

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

మళ్లీ ఎన్నికల సందడి మొదలైంది. స్థానిక సంస్థల ఎన్నిక జరిగి నాలుగేళ్లు పూర్తికావడంతో పలు చోట్ల అభ్యర్థుల మార్పులు అవిశ్వాస తీర్మానాలు ఆరంభంకానున్నాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు డివిజన్లలో మొత్తం 35 పంచాయతీల్లో ఖాళీ అయిన ఉపసర్పంచ్ పదవులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఆయా పంచాయతీల పరిధిలోని వార్డు సభ్యులకు నోటీసులు ఇచ్చారు. 27న ఈవోపీఆర్డీ ఎన్నికల అధికారిగా ఆయా పంచాయతీల్లో ఎన్నికలు నిర్వహిస్తారు.కూటమి అధికారంలోకి ఉండడంతో ఉపసర్పంచ్ పదవులు కైవశంచేసుకోవాలనే వ్యూహంతో వ్యవహరిస్తోంది.

- తూర్పుగోదావరి జిల్లాలో 12 ఉపసర్పంచ్ పదవులకు ఎన్నికలు జరగనున్నాయి.గోకవరం మండలం మల్లవరం, కొవ్వూరు మండలం పెనకనమెట్ట, రాజానగరం మండలం పాతతుంగపాడు, గోపాలపురం మండలం కొవ్వూరుపాడు,గోపాలపురం,వెంకటాయపాలెం, తాళ్ళపూడి మండలం తాడిపూడి, అనపర్తి మండలం లక్ష్మీనరసాపురం,రంగంపేట మండలం మర్రిపూడి, కడియం మండలం మురమండ,సీతానగరం మండలం మునికూడలి,ఉండ్రాజవరం గ్రామాల్లో ఉపసర్పంచ్ ఎన్నికలు జరుగనున్నాయి.
- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఆత్రేయపురం మండలం పులిదిండి, రాయవరం మండలం వెదురుపాక, రాయవరం, ఐ.పోలవరం మండలంలో జి.మూలపొలం,ముమ్మిడివరం మండలం సిహెచ్.గున్నేపల్లి, రాజోలు మండలం సోంపల్లి, శివకోటి, ఆలమూరు మండలం మొదుకూరు, కొత్తపేట మండలం కొత్తపేట, పలివెల, మలికిపురం మండలం లక్కవరం,చింతలమోరి, సఖినేటిపల్లి మండలంలో మోరిపొడు, అంతర్వేదిపాలెం, అంబాజీపేట మండలంలో మాచవరం, అల్లవరం మండలంలో ఎంట్రికోన, అయినవిల్లి మండలంలో బోతుకుర్రు, రామచంద్రపురం మండలం నెలపర్తిపాడు పంచాయతీల్లో ఉపసర్పంచ్ పదవులకు ఎన్నికలు జరుగనున్నాయి.
- కాకినాడ జిల్లాలో పెదపాడు మండలం రామేశ్వరం,తుని పరిధిలో దొండవాక,సామర్లకోట మండలం బి.వేమవరం, తొండంగి మండలం పైడికొండ,ప్రత్తిపాడు మండలం పెదశంకర్లపూడి పంచాయతీల పరిధిలో ఉపసర్పంచ్ ఎన్నికలు జరుగనున్నాయి.

బీసీ రుణాలకు గడువు పెంపు

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 23(ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ ద్వారా పేదలకు స్వయం ఉపాధి యూనిట్లకు దరఖాస్తుల గడువును ఈనెల 25 వరకు పెంచినట్టు బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసరావు ఒకప్రకటనలో తెలిపారు. ఈనెల 22తో గడువు ముగిసినప్పటికీ మరో మూడు రోజులు పెంచామని ఆయన చెప్పారు. కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాల వారి దరఖాస్తులకు 21నుంచి 50ఏళ్ల వరకు అవకాశం కల్పించగా, దాన్ని 21 నుంచి 60ఏళ్లకు పెంచామని చెప్పారు. ఈబీసీలు కూడా http:apobmms.apcfss.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

జనసేన సభను విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు 7
- డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

ముంబై ఇండియన్స్‌లో... మనోడు మెరిశాడు! 7
- ఐపీఎల్‌లో ఆడిన కాకినాడకు చెందిన సత్యనారాయణరాజు

ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం ఎప్పుడో?

- బొండాలు రకం సేకరణపై రైతుల ఎదురుచూపులు

కలెక్టరేట్(కాకినాడ),మార్చి23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రబీకోతలు ప్రారంభమయ్యాయి. దీంతో రైతు సేవా కేంద్రాలు(ధాన్యం కొనుగోలు కేంద్రాలు) ఎప్పుడు ప్రారంభిస్తారని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఈ రబీ సీజన్‌లో ఎక్కువగా బొండాలు రకమే ఎక్కువగా సాగుచేశారు. జిల్లాలో ఈ రబీ సీజన్‌లో 5.79లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. దీనిలో 3.15లక్షల మెట్రిక్ టన్నులు బొండాలు రకమే వస్తుందని భావిస్తున్నారు. జిల్లాలో 35 వేల హెక్టార్లలో ఈ విత్తనాన్ని సాగుచేశారు. బొండాలు రకం సాగుచేస్తే ఎకరానికి 50నుంచి 60 బస్తాలు దిగుబడి వస్తుందనే ఆశతో రైతులు ఇబ్బడిముబ్బడిగా సాగుచేశారు. ఈ రకం ధాన్యాన్ని సేకరించడంపై ప్రభుత్వం ఇంకా సన్నద్ధంకాలేదు. దీంతో రైతులు అయోమయస్థితిలో ఉన్నారు. గతేడాది రబీ సీజన్‌లో 214 రైతు సేవాకేంద్రాల ద్వారా 25వేలమెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే ప్రభుత్వం సేకరించింది. అప్పట్లో ఈ రకం ధాన్యానికి బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలు పలికాయి. పైగా కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో బాయిల్డ్ రైస్‌కు మంచి డిమాండ్ ఉంది. దీంతో రైతులు ఎక్కువగా బహిరంగ మార్కెట్‌లో ధాన్యం విక్రయించారు. 2021-22 రబీలో 2.59లక్షల మెట్రిక్ టన్నులు సేకరించారు. 2022-2023 రబీలో 84,161 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వం సేకరించింది.

తమిళనాడు, కేరళ మార్కెట్‌పైనే గురి

ఇప్పటికే గండేపల్లి మండలంలో రబీకోతలు ప్రారంభం కాగా తర్వాత పెదపూడి, సామర్లకోట, పెద్దాపురం మండలాల్లో కోతలు ప్రారంభమవుతామని వ్యవసాయశాఖ అధికారులు చెప్తున్నారు. ఏప్రిల్ రెండోవారంలో 225 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసే అవకాశం ఉన్నట్లు వారు తెలిపారు. బొండాలు రకం బియ్యాన్ని దేశంలో ఎక్కువగా తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో వినియోగిస్తారు. గతేడాది ఈ రాష్ట్రాల్లో మంచి డిమాండ్ ఉండడంతో స్థానిక మిల్లర్లు పెద్దఎత్తున బొండాలురకం ధాన్యం కొనుగోలు చేసి బియ్యాన్ని ఎగుమతి చేశారు. ఈ ఏడాది మార్కెట్ ఎలాఉంటుందో ఇప్పుడే చెప్పలేమంటున్నారు. బొండాలు రకం బియ్యాన్ని కేరళ రాష్ట్రంలో ఎక్కువగా హోటళ్లలో వినియోగిస్తారు. దీంతో అక్కడకు ఎక్కువగా ఎగుమతి వెళ్తుందని మిల్లర్లు అభిప్రాయపడుతున్నారు. గతేడాది ప్రభుత్వం 75కిలోల బస్తా రూ.1730 చెల్లించగా బహిరంగ మార్కెట్‌లో రూ.1800 నుంచి రూ.1900 వరకు ధర పలికింది. దీనివల్ల రైతన్న బాగానే లాభపడ్డారు.

ప్రభుత్వం సేకరిస్తే ఎఫ్‌సీఐకే..

బొండాలు రకం ధాన్యం ప్రభుత్వం సేకరిస్తే భారతఆహార సంస్థ(ఎఫ్‌సీఐ)కే అందించాలి. బొండాలు రకం బియ్యం ప్రజాపంపిణీ (పీడీఎస్)కు ఉపయోగపడవు. బొండాలు రకం బాయిల్డ్ రైస్ కావడంవల్ల ప్రజాపంపిణీకి ఉపయోగించడం లేదు. గతంలో ఈ రకం బియ్యాన్ని ఎఫ్‌సీఐకి సరఫరాచేసిన దాఖలాలున్నాయి. దీంతో ఎఫ్‌సీఐ అధికారులతో జిల్లా అధికారులు సంప్రదింపులు చేస్తున్నారు.

నేడు యథావిధిగా ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 23(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారం నిమిత్తం ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు యథావిధిగా జరుగుతుందని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు అందరూ విధిగా హాజరు కావాలన్నారు.

మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా వైద్యవిద్యార్థుల ర్యాలీ



కాకినాడలో ర్యాలీ నిర్వహిస్తున్న రంగరాయ వైద్యవిద్యార్థులు, నర్సింగ్ విద్యార్థులు

జీజీహెచ్(కాకినాడ), మార్చి 23(ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా డీఎంఈ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం ఆదేశానుసారం మానసిక వైద్యనిపుణుల ఆధ్వర్యంలో ఆదివారం భారీ ర్యాలీ నిర్వహించారు. డీఎఫ్‌పీ నోడల్ అధికారి, ఆర్ఎంసీ మానసిక వైద్యనిపుణుడు డాక్టర్ వి.వరప్రసాద్ ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శశి ప్రారంభించగా రంగరాయ వైద్యవిద్యార్థులు, నర్సింగ్ విద్యార్థులు కలిపి 300మందికిపైగా కళాశాల ప్రాంగణం నుంచి బయలుదేరి వివిధ అవగాహనా స్లోగన్లు ప్రదర్శిస్తూ భానుగుడి జంక్షన్‌కు చేరుకున్నారు. ఈ ర్యాలీని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్లు డాక్టర్ సౌమ్య, నర్సింగ్ కాలేజ్ అధ్యాపకురాలు మాధవి పర్యవేక్షించారు. డాక్టర్ వరప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న ప్రతి కళాశాల కూడా మత్తుమందుల వినియోగానికి దూరంగా ఉండాలని సూచించారు. ర్యాలీకి సహకరించిన పోలీస్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

స్మార్ట్.. ముగిసినట్టేనా?



కాకినాడ స్మార్ట్‌సిటీ కార్యాలయం

- నెలాఖరుకు ముగియనున్న స్మార్ట్ సిటీ మిషన్
- మరోసారి పొడిగింపు ఉంటుందా?
- పూర్తికాని పనులు.. జమకాని నిధులు
- నీరుగారుతున్న స్మార్ట్ సిటీ లక్ష్యం

కార్పొరేషన్(కాకినాడ), మార్చి 23(ఆంధ్రజ్యోతి): కేంద్ర గృహ నిర్మాణం, పట్టణ వ్యవహార మంత్రిత్వశాఖ స్మార్ట్ సిటీస్ మిషన్ గడువును 2024, జూలై నుంచి 2025, మార్చి 31 వరకు పొడిగించినట్లు గతేడాది ప్రకటించింది. ఈ గడువు మరో పదిరోజుల్లో ముగియనుండడంతో స్మార్ట్ సిటీస్ గడువు పొడిగిస్తారా లేక ముగిస్తారా అనే అంశం సందిగ్ధంగా మారింది.

ఐదేళ్ల సమయం... కానీ..

దేశంలో మొత్తం వంద స్మార్ట్‌సిటీల్లో కాకినాడ ఒకటి. అన్ని నగరాలు తమ లక్ష్యాలను సాధించడానికి.. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడానికి తగినంత సమయం ఉండేలా ఈ నిర్ణయం తీసుకున్నారు. స్మార్ట్ సిటీస్ మిషన్ 2017లో ప్రారంభించారు. ప్రతిపాదించిన ప్రాజెక్టులను పూర్తి చేయడానికి వారి ఎంపిక తేదీనుంచి ఐదేళ్ల సమయం ఇచ్చారు. 2022తో స్మార్ట్‌సిటీ గడువు ముగియడంతో 2024, జూన్ 30 వరకు గడువు పెంచారు. జూన్ 30తో ఆ గడువు పూర్తవడంతో తిరిగి మరో 9నెలలు 2025, మార్చి 31 వరకు స్మార్‌సిటీ గడువు పొడిగిస్తూ ఉత్తర్వులు అందాయి. స్మార్ట్ సిటీ బోర్డు అయినప్పటికీ కాకినాడలో స్మార్ట్ సిటీ పథకం కింద అనేక పనులు ఇంకా అసంపూర్తిగా ఉన్నాయి. కాగితంపై పూర్తి చేసినట్లు కనిపించిన ఇప్పటికీ అసంపూర్తిగా ఉన్నాయి. స్మార్ట్‌సిటీ పథకానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నుంచి కాకినాడకు మొత్తం రూ.వెయ్యి కోట్లు మంజూరుకాగా అందులో ఇప్పటికే రూ.978 కోట్లు మంజూరయ్యాయి. రూ.884.79కోట్లు వర్క్‌లు జరిగాయి. రూ.784కోట్లు వర్క్‌లకు సంబంధించి బిల్లులు క్లియర్ అయ్యాయి. ఇంకా రూ.101 కోట్లు సంబంధించి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. పెండింగ్‌లో ఉన్న వర్క్‌లు పూర్తి చేయడానికి ఇంకా రూ.93కోట్లు అవసరం ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం వాటా కింద రావాల్సిన నిధులు విడుదల కాగా, రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇంకా రూ.94కోట్లు రావాల్సి ఉంది. స్మార్ట్‌సిటీలో 70 పనులు చేపట్టగా 56కి పైగా పూర్తయ్యాయి. మిగిలిన 14 పనులను పూర్తి చేయాల్సి ఉంది.

సిబ్బంది కుదింపు

స్మార్ట్‌సిటీ ప్రారంభదశలో అధికారులు సిబ్బంది కలిపి 40మంది పనిచేసేవారు. ప్రస్తుతం ఆ సంఖ్య 11మందికి చేరింది. వీరికి కూడా మూడు నెలలుగా జీతాలు ఇవ్వని పరిస్థితి నెలకొంది. దీంతో ఈనెల మార్చి 31తో స్మార్ట్‌సిటీస్ గడువు ముగియనుందా? లేకపోతే పొడిగిస్తున్నారా అనే అంశంపై సిబ్బంది లోను అధికారుల్లోను చర్చ నడుస్తోంది. ఇదే అంశంపై సిటీ ఎమ్మెల్యే కొండబాబు అసెంబ్లీ సమావేశంలో మాట్లాడారు. స్మార్‌సిటీలో భాగంగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం వాటాల కింద విడుదల చేసిన నిధులతో అనుకున్న స్థాయిలో కాకినాడ నగరం అభివృద్ధి చెందలేదని నిధులు దుర్వినియోగం అయ్యాయంటూ ఎన్నో విమర్శలున్నాయి. అందుకు తగ్గట్టుగానే నగరం దర్శనమిస్తోంది. స్మార్‌సిటీస్ అభివృద్ధిలో భాగంగా ఇతర నగరాలతో పోలిస్తే కాకినాడ అంతగా అభివృద్ధి చెందలేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. నగరం నలుమూలల ఎంట్రన్స్‌లు, కూడళ్ల అభివృద్ధి వాటి అంశాలు కాకినాడ వెనుకబడి ఉంది. ఈ క్రమంలో స్మార్ట్‌సిటీస్ మిషన్‌లో భాగంగా కాకినాడ స్మార్ట్‌సిటీ అనుకున్న స్థాయిలో లక్ష్యం నీరుగారుతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇందుకు నిదర్శనం రూ.15కోట్లతో నిర్మించిన సైన్స్ సెంటర్ ఏడేళ్లగా నిర్మాణ పనులు పూర్తికాక నిరుపయోగంగా దర్శనమిస్తోంది.

నిరుపయోగంగా అలా..

మత్స్యకారులకోసం రూ.9కోట్లతో నిర్మించిన బోట్ బిల్డింగ్ యాడ్ కూడా నిరుపయోగంగానే ఉంది. రూ.9.64కోట్లతో నిర్మించిన మల్టీపర్పస్ కన్వర్టబుల్ స్టేడియం కూడా ఏడేళ్లుగా నిరుపయోగంగా దర్శనమిస్తోంది. విద్యార్థులకు వర్చువల్ క్లాస్ రూమ్స్ అంటూ రూ.10.72కోట్లతో నిర్మించిన డిజిటల్ వర్చువల్ క్లాస్‌రూమ్స్ కూడా ఒక క్లాస్ కూడా జరగకుండానే ఏడేళ్లుగా అలా పడి ఉంది. రూ.40.01కోట్లతో నిర్మాణం తలపెట్టిన నగరపాలక సంస్థ నూతన భవన నిర్మాణం కూడా నిధుల కొరతతో మధ్యలో నిలిచిపోయింది. దేశంలోనే మొట్టమొదటి ఏసీ బస్ స్టాప్ అంటూ నిర్మించిన దానిలో ఏసీ లేదు. ప్రయాణికులు కూర్చునేందుకు కనీస సౌకర్యాలు కూడా లేని పరిస్థితిలో నిరుపయోగంగా మారింది. రోడ్ల మీద రోడ్లు వేశారని విమర్శలతో స్మార్ట్‌సిటీలో రూ.475కోట్లతో రోడ్లు నిర్మించారు. ఇలాంటి పరిస్థితులు స్మార్ట్‌సిటీ గడువు పెంచుతారా ఇక్కడితో ముగిస్తారా అనే సందిగ్ధత అందరిలోను నెలకొంది.

స్వాతంత్ర్య సంగ్రామంలో దొమ్మేటి కృషి మరువలేనిది: మంత్రి సుభాష్



దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి సుభాష్

కరప, మార్చి 23(ఆంధ్రజ్యోతి): భారత స్వాతంత్ర్య సంగ్రామంలో జాతియోద్ధరణకు దొమ్మేటి వెంకటరెడ్డి చేసిన కృషి మరువలేనిదని రాష్ట్ర కార్మికశాఖామంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. శెట్టిబలిజ జాతిపిత, బర్మా కేసరి దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి సందర్భంగా కాజులూరు మండలం దుగ్గుదుర్రు గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మంత్రి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. వెంకటరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దొమ్మేటి వెంకటరెడ్డి నిరక్షరాస్యత నిర్మూలనకు ఎనలేని సేవలందించారన్నారు. చదువు ఆవశ్యకతను దూరదృష్టితో ఆలోచించిన ఆయన వయోజన విద్యను ప్రోత్సహించడంతోపాటు ఎన్నో ప్రాథమిక పాఠశాలలు, గ్రంథాలయాలు, రాత్రి బడులను నెలకొల్పారన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, శెట్టిబలిజ సంఘాల పెద్దలు, మహిళలు, అభిమానులు పాల్గొన్నారు. దుగ్గుదుర్రు చెరువుగట్టుసెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో అమలాపురం పార్లమెంట్ శెట్టిబలిజ సంక్షేమ సంఘం కన్వీనర్ కడలి రాంపండు, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ పెంకే సత్యనారాయణ వెంకటరెడ్డి విగ్రహానికి నివాళులర్పించారు.

జనసేనకే ఎంపీపీ

- వైసీపీకి మరో ఎంపీటీసీ రాజీనామా
- జనసేనలో చేరిక
- 10మంది ఎంపీటీసీల మద్దతుతో కాకినాడ రూరల్ ఎంపీపీ కైవసం



పండూరు ఎంపీటీసీ శ్రీనివాస్‌కు జనసేన కండువా వేస్తున్న ఎమ్మెల్యే పంతం నానాజీ

సర్పవరంజంక్షన్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ ఎంపీపీ జనసేన ఖాతాలో పడింది. మండలంలో మరో ఎంపీటీసీ సభ్యుడు వైసీపీని వీడి జనసేన తీర్థం పుచ్చుకున్నారు. కాకినాడ రూరల్ పండూరుకు చెందిన వైసీపీ ఎంపీటీసీ నందిపాటి వెంకట శ్రీనివాస్, జనసేన పార్టీకి చెందిన ఎంపీటీసీ నందిపాటి వెంకటలక్ష్మి, భర్త త్రిమూర్తులతో కలిసి ఆదివారం గొడారిగుంట వచ్చి ఎమ్మెల్యే పంతం నానాజీ సమక్షంలో జనసేన కండువా వేయించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలాన్ని ప్రగతి పథంలో నిలిపేందుకు పార్టీలకు అతీతంగా కలిసి పనిచేద్దామన్నారు. జనసేన అధినేత,డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సిద్ధాంతాలు, పనితీరుకు ఆకర్షితుడిగా మారి పార్టీలో చేరినట్లు ఎంపీటీసీ శ్రీనివాస్ తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు కరెడ్ల గోవిందు, పాండ్రంకి రాజు పాల్గొన్నారు.

ఎంపీపీ పీఠం జనసేనకే..

2021లో ఏప్రిల్‌లో స్థానిక సంస్థలకు ఎన్నికలు జరగడం, ఆ ఎన్నికల్లో వైసీపీ విజయదుందుభి మోగించడం తెలిసిందే. కాకినాడ రూరల్ ఎంపీపీగా గోపిశెట్టి పద్మ బాధ్యతలు చేపట్టారు. వ్యక్తిగత కారణాల రీత్యా ఎంపీపీకి పదవికి ఆమె 2024,జూన్ 30న రాజీనామా చేశారు. 8నెలలపాటు ఇన్‌చార్జి ఎంపీపీగా వైస్ ఎంపీపీ బిందిలి శిరీష బాధ్యతలు చేపట్టారు. ఖాళీగా ఉన్న ఎంపీపీ పదవికి మార్చి 27న పరోక్ష పద్ధతిలో ఎన్నిక నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేయడంతో ఈ ఎన్నిక అనివార్యమైంది. కాకినాడ రూరల్ మండలంలో 18మంది ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు. ఇందులో మొన్నటి వరకు వైసీపీకి 15, జనసేనకు 3 ఎంపీటీసీలు ఉన్నాయి. మారిన రాజకీయ పరిణామాలు, కూటమి ఎమ్మెల్యేగా జనసేన పార్టీకి చెందిన పంతం నానాజీ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. రూరల్ ఎంపీపీ పీఠాన్ని జనసేనకు దక్కేలా వ్యూహాత్మకంగా పావులు కదిపారు. వైసీపీ ఎంపీటీసీలను పార్టీవైపు వచ్చేలా కృషి చేశారు. ఇటీవల తెనాలిలో మంత్రి నాదెండ్ల సమక్షంలో వైసీపీ నుంచి ఆరుగురు ఎంపీటీసీలు, ఆదివారం మరో ఎంపీటీసీ సభ్యుడు నందిపాటి వెంకట శ్రీనివాస్ జనసేనలో చేరికతో ఎంపీపీకోసం అవసరమైన సాధారణ బలం 10మంది మద్దతు ఉంది. ఈనెల 27న జరిగే ఎంపీపీ ఎన్నికలో జనసేన అభ్యర్థికే ఎంపీపీ దక్కనుంది.

దొంగలు దొరికారు!

● బైక్ దొంగతనాలకు పాల్పడిన ఇద్దరిని అరెస్ట్ చేసిన రాజమహేంద్రవరం పోలీసులు

● రూ.16 లక్షలు విలువ చేసే 31 ద్విచక్ర వాహనాల స్వాధీనం



రాజమహేంద్రవరంలో 31 బైక్‌లు, దొంగలతో డీఎస్పీ రమేష్ బాబు, సీఐ బాజీలాల్

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి, కృష్ణా జిల్లాల్లో బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు బైక్ దొంగలను తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ప్రకాష్‌నగర్ పోలీసులు పట్టుకున్నారు. ఆదివారం పోలీస్ స్టేషన్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో సెంట్రల్ జోన్ డీఎస్పీ కె.రమేష్ బాబు మాట్లాడారు. ప్రకాష్‌నగర్ సీఐ బాజీలాల్ ఆధ్వర్యంలో ఎస్ఐ ఎస్.శివ ప్రసాద్, క్రైమ్ కానిస్టేబుల్స్ కె.ప్రదీప్‌కుమార్, ఎస్.వీరబాబు, వి.శివ ప్రసాద్‌లు.. బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న నల్లజర్ల మండలం వడ్లమూడి గ్రామానికి చెందిన తూర్ల సోమయ్యను, అతడు దొంగిలించిన బైక్‌లను కొనుగోలు చేస్తున్న నల్లజర్ల మండలం జగన్నాథపురానికి చెందిన చీర్ల కిషోర్‌ను అదుపులోకి తీసుకున్నారని చెప్పారు. సోమయ్య 3 నెలలుగా రాజమహేంద్రవరంలోని మంగళవారపుపేటలో ఇల్లు అద్దెకు తీసుకుని చుట్టుపక్కల తిరుగుతూ బైక్ దొంగతనాలు చేస్తున్నాడు. అతడు ప్రకాష్‌నగర్ పరిధిలో 9, త్రీటౌన్ పరిధిలో 9, వన్‌టౌన్ పరిధిలో 3, నల్లజర్ల పోలీస్ స్టేషన్ పరిధిలో 2, కోరుకొండ స్టేషన్‌పరిధిలో 1, ఏలూరు స్టేషన్ పరిధిలో 3, విజయవాడలో 1 బైక్‌ను దొంగించాడు. అతడిపై ఆయా స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. రాజమహేంద్రవరం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద బైక్ దొంగతనం చేస్తుండగా అరెస్టు చేసి విచారించగా అతడి వద్ద రూ.16లక్షలు విలువ చేసే 31 బైక్‌లు ఉన్నట్టు గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ చెప్పారు. ఈ కేసును ఛేదించిన సీఐ, ఎస్ఐ, క్రైమ్ కానిస్టేబుళ్లను జిల్లా ఎస్పీ నరసింహకిషోర్ అభినందించారని డీఎస్పీ తెలిపారు.

తిమ్మాపురంలో బైక్ దొంగ అరెస్ట్

18 బైక్‌లు స్వాధీనం

సర్పవరం జంక్షన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): చెడు వ్యసనాలబారిన పడిన నిందితుడు కష్టపడకుండా సులువుగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశ్యంతో బైకల చోరీ బాట పట్టి ఎట్టకేలకు పోలీసులకు చిక్కాడు. ఆదివారం కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం తిమ్మాపురం పోలీస్‌స్టేషన్‌లో విలేకర్ల సమావేశంలో ఈ వివరాలను రూరల్ సర్కిల్ సీఐ డీఎస్ చైతన్యకృష్ణ వివరించారు. ఉప్పాడ కొత్తపల్లి మండలం బొండపల్లి ఏసుకుమార్ అనే వ్యక్తి లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. చెడు వ్యవసనాలకు అలవాటు పడి బైక్‌ల చోరీల బాటపట్టాడు. ఇంటి ఆవరణ, పబ్లిక్ స్థలాలు, రోడ్డు పక్కన పార్కింగ్ చేసిన బైక్ లాక్‌లను ఎంతో చాకచక్యంగా మారుతాళాలతో తొలగించి బైక్‌లను ఎత్తుకుపోయి అమ్మేస్తున్నాడు. బైక్ పోగొట్టుకున్న బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఎస్‌డీపీవో దేవరాజ్ మనీష్ పాటిల్ నేతృత్వంలో రూర ల్ సర్కిల్ సీఐ చైతన్యకృష్ణ, తిమ్మాపురం పోలీసులు, క్రైం పార్టీ సిబ్బంది నిందితుడి కోసం దర్యాప్తు చేస్తున్నారు. అయితే ముందస్తు సమాచారం మేరకు తిమ్మాపురం పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తోండగా తిమ్మాపురం వై జంక్షన్ నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా, వేర్వేరు పోలీస్‌స్టేషన్ల పరిధిలో 18 బైక్‌ల దొంగతనం చేసినట్టు వెలుగులోకి వచ్చిందని సీఐ చైతన్యకృష్ణ తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసి 18 బైక్‌లతో పాటూ, బొమ్మూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో దివాన్‌చెరువులో చోరీ చేసిన 2బంగారు ఉంగరాలు, ఓ చైన్‌ని స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడు చిన్నతనంలో తల్లి మరణించడంతో తండ్రి పర్యవేక్షణ సరిగా లేకపోవడంతో చెడు వ్యసనాల బాట పట్టాడన్నారు. నిందితుడిపై పెద్దాపురం, భీమవరం టూటౌన్‌లో -2, కాకినాడ పోర్టు, తుని టౌన్‌లో -2, కాకినాడ టూటౌన్ క్రైం పీఎస్‌లో 3, అమలాపురం టౌన్ పీఎస్‌లలో 10 కేసులు ఉన్నట్టు తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసి, బైక్‌లను స్వాధీనం చేసుకున్న అధికారులు, సిబ్బందిని ఎస్‌డీపీవో దేవరాజ్ మనీష్ పాటిల్ అభినందించారు. సమావేశంలో తిమ్మాపురం స్టేషన్ ఎస్‌హెచ్‌వో, ట్రైనీ ఐపీఎస్ సుస్మిత, ఎస్ఐ ఎంవీవీ రవీంద్రబాబు ఉన్నారు.



నిందితుడు, 18 బైక్‌లతో సీఐ చైతన్యకృష్ణ, తిమ్మాపురం ఎస్‌హెచ్‌వో, ట్రైనీ ఐపీఎస్ సుస్మిత

ముంబై ఇండియన్స్‌లో...

మనోడు మెరిశాడు!

ఐపీఎల్‌లో ఆడిన కాకినాడకు చెందిన సత్యనారాయణ రాజు



సత్యనారాయణ రాజు

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

కాకినాడకు చెందిన ఫాస్ట్ బౌలర్ పెన్మత్స సత్యనారాయణ రాజుకు ఐపీఎల్‌లో ఆడే అవకాశం దక్కింది. ముంబై ఇండియన్స్ జట్టులో బౌలర్‌గా చోటు దక్కించుకున్నాడు. ఆదివారం చెన్నై సూపర్ కింగ్స్, ముంబై ఇండియన్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో సత్యనారాయణ ఆడడంతో ఆయన కుటుంబసభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. కాకినాడలోని వారి ఇంటిలో కుటుంబసభ్యులు, బంధువులు ఆ మ్యాచ్‌ను ఆసక్తిగా తిలకించారు. ఫాస్ట్ బౌలర్ అయిన సత్యనారాయణ రాజు దేశవాలీ లీగ్లో సత్తా చాటాడు. రంజీ పోటీల్లో ఎనిమిది మ్యాచ్‌లలో 17 వికెట్లు తీసి అందరి దృష్టి ఆకర్షించాడు. ఈ నేపథ్యంలోనే అతడు ముంబై ఇండియన్స్ జట్టుకు ఎంపికైనట్టు ఆయన తండ్రి రమేష్ తెలిపారు. ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ వంటి పెద్ద జట్టులో చోటు దక్కడం చాలా ఆనందంగా ఉందని వెల్లడించారు.



టీవీలో ఐపీఎల్‌ను తిలకిస్తున్న సత్యనారాయణ రాజు కుటుంబసభ్యులు, స్నేహితులు

రొమ్ము క్యాన్సర్ శస్త్రచికిత్సలపై వర్క్‌షాపు

జీజీహెచ్ (కాకినాడ), మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లోని సర్జరీ విభాగంలో ఆదివారం రొమ్ము క్యాన్సర్ శస్త్రచికిత్సలపై వర్క్‌షాపు జరిగింది. సర్జరీ హెచ్‌వోడి డాక్టర్ ఎన్.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన వర్క్‌షాపుకు ముఖ్యఅతిథిగా డీఎంఈ, డాక్టర్ ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్శిటీ వీసీ, ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం హాజరయ్యారు. ఇలాంటి వర్క్‌షాపులు మరిన్ని జరగాలని తద్వారా వైద్య విద్యార్థులకు శస్త్రచికిత్సా విధానాలపై మరింత పట్టు సాధించడానికి అవకాశం ఉంటుందన్నారు. కాకినాడతో సహా రాజమహేంద్రవరం, అమలాపురం, విశాఖపట్నం, శ్రీకాకుళం వైద్య కళాశాలలకు చెందిన పీజీ వైద్య విద్యార్థులు హాజరయ్యారు. సర్జరీ వైద్య నిపుణులు రొమ్ము క్యాన్సర్‌కు సంబంధించిన ఆపరేషన్లను ప్రత్యక్ష ప్రసారం ద్వారా విద్యార్థులకు బోధించారు. క్యాన్సర్ నిపుణులు డాక్టర్ సౌమ్య, డాక్టర్ ప్రశోట్, డాక్టర్ నరేంద్ర బోధకులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి, ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ విష్ణువర్ధన్, ఆర్థోపెడిక్ హెచ్‌వోడి డాక్టర్ ఎంపీఆర్ విఠల్, డాక్టర్ కె.బాబ్జి, డాక్టర్ పి.వెంకటబుద్ధా, డాక్టర్ రవికమల్, డాక్టర్ వెంకటరెడ్డి, డాక్టర్ శైలజారాణి, డాక్టర్ శివరామకృష్ణ, డాక్టర్ మైథిలిదేవి, డాక్టర్ శైలజా హాజరయ్యారు.

పరారైన ఖైదీని పట్టుకున్న పోలీసులు



ఖైదీతో యానాం పోలీసులు

యానాం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): యానాం సబ్ జైలు నుంచి రిమాండ్ ఖైదీ పరారైన కొద్దిగంటల్లోనే యానాం పోలీసులు పట్టుకున్నారు. దాదాపు 25అడుగు ఎత్తున్న సబ్ జైల్ ప్రహరి దూకి నిందితుడు కే.వెంకటేశ్వరరావు పరారైన విషయం తెలిసిందే. శనివారం రాత్రి పోలీసులు కాకినాడ రైల్వే స్టేషన్‌లో ఖైదీని పట్టుకున్నారు. క్రైం సిబ్బంది పబ్బినీడి ఏసుబాబు, మల్లాడి గణేష్, దేవరపల్లి సురేష్‌లను సీఐ షణ్ముగం, మాజీ సీఐ గూటం శివగణేష్ అభినందించి సత్కరించారు.

నాలుగు రోజుల్లో కొత్తపేటకు వస్తా

పరారైన సత్యసూర్య బ్యాంకర్స్ నిర్వాహకుడు సెల్ఫీ వీడియో



సెల్ఫీ వీడియోలో మాట్లాడుతున్న హేమంత్

కొత్తపేట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట సత్యసూర్య బ్యాంకర్స్ నిర్వాహకుడు పరారై సుమారు 45 రోజులు గడుస్తున్న విషయం తెలిసిందే. అయితే ఆదివారం హేమంత్ ఒక సెల్ఫీ వీడియోను విడుదల చేసి పలు విషయాలను చెప్పాడు. తాను ప్రాణభయంతో పారిపోయానని, 4రోజుల్లో కొత్తపేటకు వస్తానని తెలపాడు. అయితే తమ వ్యాపార సంస్థలో తాకట్టు పెట్టిన ఏ బంగారు వస్తువులను కరిగించలేదని కూడా తీసుకుని వెళ్లలేదని చెప్పాడు. తాను నమ్మి ఒక రియల్ ఎస్టేట్ వ్యాపారితో కొన్ని లావాదేవీలు జరపడం అతడు సమాధానం చెప్పకపోవడంతో తాను పరారీ కావాల్సి వచ్చిందన్నాడు. తమ తాకట్టు వ్యాపారంలో కుదువపెట్టిన ఖాతాదారులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రతి పద్దు వివరాలు తన వద్ద ఉన్నా యన్నాడు. ఖాతాదారులు పెట్టిన బంగారు వస్తువుల సైతం కొన్ని తన వద్ద, మిగిలినవి తన పార్ట్‌నర్స్ వద్ద భద్రంగా ఉన్నాయని తాను వచ్చిన తరువాత పోలీసుల సమక్షంలో అన్ని వెల్లడిస్తానని హేమంత్ వీడియోలో పేర్కొన్నాడు.

సామర్లకోటలో ఉత్సాహంగా...

రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగు ప్రదర్శన పోటీలు

సీనియర్స్‌లో విజేతగా గుమ్మిలేరు, జూనియర్స్‌లో సామర్లకోట ఎడ్లు



పోటీలో పరిగెడుతున్న ఎడ్లు



సీనియర్స్ విభాగంలో ప్రథమ బహుమతిని శృతిచౌదరికి అందజేస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప

సామర్లకోట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కుమార రామ భీమేశ్వరా రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగు ప్రదర్శన పోటీలు ఆదివారం కాకినాడ జిల్లా సామర్లకోట ఉండూరు ఎన్ఎఫ్‌సీఎల్ పైప్‌లైన్ రోడ్డులో ఉత్సాహంగా నిర్వహించారు. వల్లూరి సత్యేంద్రకుమార్ మెమోరియల్‌గా ఈ పోటీలను నిర్వహించగా మున్సిపల్ మాజీ చైర్మన్ డాక్టర్ చందలాడ అనంత పద్మనాభం, ఎమ్మెల్యే చినరాజప్ప తనయుడు నిమ్మకాయల రంగనాగ్ ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హాజరైన పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పోటీలను తిలకించి విజేతలకు బహుమతులు అందజేశారు. 4 కిలోమీటర్లు వెళ్లి వచ్చేందుకు నిర్వహించిన పోటీల్లో సీనియర్స్ విభాగంలో ప్రథమ స్థానాన్ని గుమ్మిలేరుకు చెందిన కోరా శృతిచౌదరికి చెందిన ఎడ్లు ప్రథమ స్థానంలో నిలిచింది. ద్వితీయ స్థానంలో అనకాపల్లి అర్జునగిరికి చెందిన పరవన్నాయుడి ఎడ్లు, తృతీయ స్థానంలో గుమ్మిలేరుకు చెందిన ఎడ్లు నిలిచి బహుమతులు సాధించాయి. సీనియర్స్ విభాగంలో 12 జతల ఎడ్లు పాల్గొన్నాయి.

జూనియర్స్ విభాగంలో సామర్లకోట వల్లూరి సత్యేంద్రకుమార్‌కు చెందిన ఎడ్లు ప్రథమ స్థానం, ద్వితీయ స్థానంలో వడిశలేరు సిద్ధివినాయక శ్రీనివాసుకు చెందిన ఎడ్లు, తృతీయ స్థానంలో గాడాల మద్దాల శ్రీనుకు చెందిన ఎడ్లు, నాల్గోస్థానంలో వెల్లుర్తి మొగలి ఏసుబాబుకు చెందిన ఎడ్లు, ఐదోస్థానంలో సామర్లకోట వల్లూరి సత్యేంద్రకుమార్‌కు చెందిన ఎడ్లు నిలిచి బహుమతులు సాధించాయి. జూనియర్స్ విభాగంలో మొత్తం 25 జతల ఎడ్లు పాల్గొన్నాయి. పోటీల నిర్వాహకులు కంటే జగదీష్‌మోహన్, వల్లూరి దొరబాబు తదితర కమిటీ ప్రతినిధుల చేతుల మీదుగా ఎమ్మెల్యేను సత్కరించారు.

బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం అమలు చేయాలి

జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంగళరావుయాదవ్



మాట్లాడుతున్న వెంగళరావుయాదవ్

అమలాపురం టౌన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచిన వెనుకబడిన వర్గాలు అంతకంతకు వెనుకబడిపోతున్నాయని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంకగళరావు యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం ప్రెస్ క్లబ్‌లో ఆదివారం జరిగిన సంక్షేమ సంఘ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. జనాభా దామాషా ప్రకారం బీసీలకు చట్టసభల్లో సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇందు కోసం జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అన్ని రాష్ట్రాల బీసీ ప్రతినిధులతో ఢిల్లీని దిగ్బంధనం చేస్తామని ప్రధాని మోదీకి బీసీల సత్తా చూపిస్తామన్నారు. సమాజంలో బీసీలపై దాడులు, అవమానాలు పెరిగిపోతున్నందున రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వెంటనే బీసీలకు ప్రత్యేక రక్షణచట్టం అమలు చేయాలన్నారు. చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు.

కార్యవర్గ సభ్యులుగా నియామకం

జిల్లా నుంచి జాతీయ బీసీసంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మట్ట రాంబాబు, రాష్ట్ర కార్యదర్శులుగా కైల శోభన్‌బాబు, కందుల విజయ్‌కుమర్‌లను నియమిస్తూ నియామక పత్రాలు అందజేశారు. జిల్లాశాఖ గౌరవాధ్యక్షుడిగా రాయుడు సత్యరుషి, అధ్యక్షునిగా కాటాడి ఉమామహేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కోరశిఖ సుబ్రహ్మణ్యం, జిల్లా ఉపాధ్యక్షులుగా పావులూరి శివరామకృష్ణ, సూరిబోయిన సుబ్రహ్మణ్యం, కోశాధికారి, అధికార ప్రతినిధిగా కానుబోయిన దుర్గాప్రసాద్, యువజన సంఘ అధ్యక్షునిగా మందపాటి బాలు, కార్యదర్శులుగా కముజు శ్రీనివాసరావు, టేకి వెంకటరమణలను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించి వెంగళరావుయాదవ్ అభినందించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బూరుబోయిన శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కృష్ణమోహన్‌ముదిరాజ్, గొనుగుంట్ల యల్లమందరావు, కార్యదర్శి చిట్టిబాబు పాల్గొన్నారు.

విద్యారంగంలోని

ఆర్థిక సమస్యలను పరిష్కరించాలి

యూటీఎఫ్ పోరుబాట విద్యాసదస్సులో రాష్ట్ర నాయకులు, పీడీఎఫ్ ఎమ్మెల్సీల డిమాండ్



పోరుబాట సదస్సులో మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, హాజరైన ఉపాధ్యాయులు

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): విద్యారంగంలోని ఆర్థిక సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని, ఉద్యోగులు, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలపై రోడ్ మ్యాప్ ప్రకటించాలని యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు, పీడీఎఫ్ ఎమ్మెల్సీలు డిమాండ్ చేశారు. ఆదివారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని శ్రీ వెంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో పోరుబాట పేరుతో ప్రాంతీయ విద్యాసదస్సు జరిగింది. సదస్సులో యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వర్లు, కేఎస్ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ గత ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు రూ.20 వేల కోట్లు బకాయిలు పెట్టి వెళ్లిపోయిందన్నారు. కొత్త ప్రభుత్వంపై గంపెడాశలు పెట్టుకుంటే అధికారంలోకి వచ్చి 9 నెలలు గడిచినా బకాయిల చెల్లింపుపై శ్రద్ధ చూపడంలేదన్నారు. తక్షణం బకాయిలు చెల్లించాలని, 29శాతం ఐఆర్ ప్రకటించి, 12వ పీఆర్‌సీ కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మాస్టార్లు మార్కిస్టు, కమ్యూనిస్టు భావాలతో ఉన్నపుడే నూతన మానవులను, నూతన సమాజాన్ని తయారు చేయగలరన్నారు. టీచర్ ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వం జీవో 117 రద్దు, పాఠశాలల కుదింపు, పాఠశాలల్లో రెండు మీడియంలు కొనసాగింపు వంటి సమస్యలు పరిష్కరించకపోతే పోరాటాలు అనివార్యమన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.అరుణకుమారి అధ్యక్షత వహించారు. సదస్సులో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు జ్యోతిబసు, తోటకూర చక్రవర్తి, కె.శ్రీదేవి, తూర్పుగోదావరి, డాక్టర్ అంబేద్కర్ కోనసీమ, కాకినాడ, పశ్చిమగోదావరి, అల్లూరి మన్యం జిల్లాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.జయకర్, ఏ.షరీఫ్, కేవీవీ నాగేశ్వరరావు, విజయరామరాజు, రామభద్రం, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మార్చి 31 వరకు

గోదావరి డెల్టాకు నీటి విడుదల

డొంకరాయి జలాశయం ద్వారా 4 వేల నుంచి 5వేల క్యూసెక్కులు విడుదల

మోతుగూడెం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): సీలేరు కాంప్లెక్సులోని డొంకరాయి జలాశయం నుంచి గోదావరి డెల్టాకు నీటి విడుదలను మార్చి 31 వరకు కొనసాగిస్తామని జెన్‌కో వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం విడుదల చేస్తున్న 4వేల నుంచి 5వేల క్యూసెక్కులకు పెంచామని పేర్కొన్నాయి. ధవళేశ్వరం వద్ద నీటి మట్టాలు తగ్గుముఖం పట్టడంతో ఇరిగేషన్ అధికారుల అభ్యర్థన మేరకు అదనపు నీటిని విడుదల చేస్తున్నామన్నారు. అలాగే పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి అనంతరం విడుదలయ్యే మరో 4300క్యూసెక్కులు గోదావరి డెల్టాకు విడుదల చేస్తున్నామని ఆ వర్గాలు పేర్కొన్నారు. డొంకరాయి జలాశయం నుంచి మార్చి 21వ తేదీ వరకు నీటి విడుదల చేయాలని ఇరిగేషన్ అధికారులు తొలుత కోరారు. అయితే రబీ పంటలకు నీటి వినియోగం పెరగడంతో ఇరిగేషన్ అధికారులు మార్చి 31 వరకు కొనసాగించాలని కోరారు. ఈ మేరకు శనివారం ఉదయం నుంచి డొంకరాయి నుంచి 5వేల క్యూసెక్కులు, పొల్లూరు జల విద్యుత్ కేంద్రం నుంచి 4300 క్యూసెక్కులు కలిసి 9,300 క్యూసెక్కులు గోదావరి డెల్టాకు విడుదల చేస్తున్నట్టు జెన్‌కో వర్గాలు తెలిపాయి. ఫిబ్రవరి 10 నుంచి మార్చి 21 వరకు డొంకరాయి స్పిల్‌వే గేట్లు నుంచి విద్యుదుత్పత్తి చేయకుండా గోదావరి డెల్టాకు 10.19 టీఎంసీలు నీటిని విడుదల చేశామని ఆ వర్గాలు తెలిపాయి. బలిమెల జలాశయంలో ఆంధ్రావాటాగా 36.7088 టీఎంసీలు, గుంటవాడ, డొంకరాయి జలాశయాల్లో 13.5906టీఎంసీలు కలిసి 50.2994 టీఎంసీలనీటి నిల్వలు ఉన్నాయని పేర్కొన్నాయి. ఈ ఏడాది వేసవిలో సీలేరు కాంప్లెక్సులోని జల విద్యుత్ కేంద్రాలకు నీటి కొరత లేదని జెన్‌కో అధికారులు తెలిపారు.

జేఎన్టీయూకేను రోల్ మోడల్‌గా నిలిపేందుకు కృషి

వీసీ ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్



ప్రభాకరరావుకు జ్ఞాపిక అందజేస్తున్న వీసీ

జేఎన్టీయూకే, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్-2047, వికసిత్ ఆంధ్రప్రదేశ్-2047 మాదిరిగా వికసిత్ జేఎన్టీయూకే-2047కు అనుగుణంగా రోడ్ మ్యాప్ తయారుచేసి జేఎన్టీయూకేను దేశంలోని విద్యాసంస్థలకు రోల్ మోడల్‌గా నిలిపేందుకు కృషి చేయనున్నట్టు ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్ పేర్కొన్నారు. వర్శిటీలోని యూసీఈకే సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో సౌధా-2కె25 పేరుతో 2 రోజుల పాటు ఓఎస్డీ డి.కోటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన జాతీయస్థాయి సింపోజియం టెక్‌ఫెస్ట్ ఆదివారం సాయంత్రం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వీసీ ప్రొఫెసర్ సీఎస్ఆర్కే.ప్రసాద్, విశిష్ట అతిథిగా పూర్వ విద్యార్థి, విశ్రాంత కల్నల్ ఎంఎస్.ప్రభాకరరావు హాజరయ్యారు. వీసీ మాట్లాడుతూ వినూత్న కార్యక్రమాలు, నూతన ఆలోచనలకు ఇటువంటివి మంచి వేదికగా నిలుస్తాయన్నారు. ప్రభాకరరావు మాట్లాడుతూ వర్శిటీ నుంచి ఎంతోమంది పూర్వ విద్యార్థులు త్రివిధ దళాల్లో చేరి దేశానికి సేవచేశారని, వారిని స్ఫూర్తిగా తీసుకుని ప్రస్తుత ఇంజనీరింగ్ విద్యార్థులు కూడా దేశానికి సేవచేసేందుకు త్రివిధ దళాల్లో చేరాలని సూచించారు. సింపోజియంలో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన పేపర్, పోస్టర్ ప్రజంటేషన్, డ్రోన్ ప్రజంటేషన్, స్పాట్ ఈవెంట్స్, టెక్నికల్ క్విజ్ తదితర పోటీల్లో విజేతలకు, పాల్గొన్న విద్యార్థులకు అతిథులు బహుమతులు, ప్రతిభాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సీఈ శ్రీనివాసులు, డైరెక్టర్లు, విభాగాధిపతులు, జేవీఆర్ మూర్తి, రామ్‌ప్రసాద్, రాజ్‌కుమార్,అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జనసేన సభను విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు


డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

పిఠాపురం, మార్చి 23(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం చిత్రాడ శివారులో నిర్వహించిన జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవ బహిరంగ సభ జయకేతనం విజయవంతం చేసినందుకు ప్రతి ఒక్కరికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్టు జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదివారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. సభ దిగ్విజయం చేసేందుకు కృషి చేసిన అందరికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలిపారు. సభా ప్రాంగణాన్ని వేడుకకు అనువుగా తీర్చిదిద్దేందుకు కృషి చేసిన నియోజకవర్గ నాయకులు ఓదూరి నాగేశ్వరరావు, కిషోర్, కరణం సూరిబాబులకు, జయకేతనం విజయవంతం చేసేందుకు సభా ప్రాంగణం వద్ద కృషి చేసిన నాయకులు బొజ్జా రాంప్రసాద్, తలారి శ్రీనివాస్, మొగ లి రాజా, పోలం రాజేష్, కంచర్ల భవానీశంకర్, ఫులపా రాజేష్, మేశం రామకృష్ణ, పిండి శ్రీను, గరగ అయ్యప్ప, చక్కపల్లి వినయ్, పబ్బినీడి ప్రసాద్‌కు, సభా వద్ద పనిచేసిన వలంటీర్లు, వీరమహిళలు, జనసైనికులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

నిర్మలగిరిలో ప్రత్యేక ప్రార్థనలు

మేరీమాత మహోత్సవాలకు తరలిన భక్తులు

దేవరపల్లి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా గౌరీపట్నం నిర్మలగిరి పుణ్యక్షేత్ర మేరీమాత మహోత్సవాల్లో ఆదివారం మేరీ మాత మందిరం వద్ద భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆదివారం పవిత్ర దినం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి ఆలయంలో దివ్య బలిపూజ, పరిశుద్ధ జపమాల, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రత్యేక నాటికలు, నిర్వహించారు. ఆలయంలో భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసినట్టు పుణ్యక్షేత్ర డైరెక్టర్ జాన్‌పీటర్ తెలిపారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండడ ంతో ఇటు దేవరపల్లి నుంచి అటు పంగిడి నుంచి వాహనాలను పోలీసులు మళ్లించారు.



నిర్మలగిరి మెట్ల మార్గంలో కొండపైకి వెళ్తున్న భక్తులు



మేరీమాత మందిరం వద్ద ప్రార్థనలు చేస్తున్న భక్తులు

సత్యదేవుని భూములను పరిశీలించిన అటవీశాఖ కన్జర్వేటర్

అన్నవరం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానం ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల్లో ఉన్న భూములను ఆదివారం అటవీశాఖ కన్జర్వేటర్ శివరామ్, దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు, దేవస్థానం భూముల విభాగ అధికారులతో కలిసి పరిశీలించారు. ముఖ్యంగా చెందుర్తి, గొంది గ్రామాల్లో ఉన్న భూముల్లో ఏ విధమైన పంట పండించాలి, దీని అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై త్వరలో నివేదికను ఇస్తామని దానిని అనుసరించాలని తెలిపారు. దేవస్థానం ఆధ్వర్యంలో అన్నవరం ఉద్యానవనాల్లో పెంచుతున్న మారేడు వనాలపై మాట్లాడుతూ చెట్టు ఆకులను మాత్రమే కోయాలని తెంపడం, నరకడం చేయకూడదని అలా చేయడం వల్ల వనం పెరగదన్నారు. ఎప్పటికప్పుడు డ్రిప్ ద్వారా నీరు మొక్కలకు చేరేలా చూడాలన్నారు. కళాశాలను ఆనుకుని ఉన్న ఉద్యానవనం, కొండపై వేదపాఠశాల, నక్షత్రవనంలో మొక్కలు పెంచేవిధానం బాగుందని ప్రశంసించారు.



గొందిలో దేవస్థానం భూములను పరిశీలిస్తున్న అధికారులు

భక్తులతో కిక్కిరిసిన 'లోవ క్షేత్రం'

తుని రూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని మండలంలోని లోవ క్షేత్రం తలుపులమ్మ నామస్మరణతో మారుమోగింది. ఆదివారం తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. ప్రత్యేక క్యూలలో బారులు తీరిన భక్తులు అమ్మవారిని దర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆరు బయట వంటావార్పు చేసుకుని సహపంక్తి భోజనాలు చేశారు. ఆలయానికి రూ.5.10 లక్షల ఆదాయం సమకూరినట్టు ఈవో విశ్వనాధరాజు ఓ ప్రకటనలో తెలిపారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం



పిఠాపురంలో మాల సంఘాల నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

వర్గీకరణకు వ్యతిరేకంగా

మాల సంఘాల జేఏసీ సమావేశం

● డిప్యూటీ సీఎం పవన్ ఇంటికి వెళ్లేందుకు ప్రయత్నం

● అడ్డుకున్న పోలీసులు, వాగ్వాదం, ఉద్రిక్తత

పిఠాపురం, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పిఠాపురంలో సమావేశమైన మాల సంఘాల జేఏసీ నాయకులు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నివాసానికి వెళ్లేందుకు ప్రయత్నించడం ఉద్రిక్తతలకు దారితీసింది. పోలీసులు వారిని అడ్డుకోగా వాగ్వాదం చోటుచేసుకుంది. సుమారు రెండు గంటలపాటు నాయకులను పోలీసులు నిలువరించారు. ఉన్నతాధికారుల హామీతో నాయకులు వెనుతిరిగారు. ఎస్సీ వర్గీకరణకు అసెంబ్లీలో తీర్మానం చేసి అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నించడాన్ని నిరసిస్తూ పిఠాపురం పట్టణంలోని సూర్యరాయ విద్యానంద గ్రంథాలయం చెలికాని భావనరావు సభాసదన్‌లో ఆదివారం మాల సంఘాల జేఏసీ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వంవద్ద సరైన సమాచారం లేకుండా, 2011 జనాభా లెక్కల ప్రకారం ముందుకు వెళ్లడం దారుణమని నాయకులు నిరసించారు. ప్రభుత్వం ఆదే విధానం తో ముందుకు వెళ్లితే భారీ మూల్యం చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు. వర్గీకరణకు వ్యతిరేకంగా మాలలు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నివాసానికి వెళ్లి వినతిపత్రం ఇవ్వాలని నిర్ణయించారు. ఇందుకు వీరు ప్రదర్శనగా వెళ్లేందుకు సిద్ధంకాగా పిఠాపురం సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎస్ఐలు, పోలీసులు అక్కడకు చేరుకుని అడ్డుకున్నారు. ఈ సమయంలో మాల సంఘాల నాయ కులు, పోలీసుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. తాము వినతిపత్రం ఇచ్చేందుకు వెళుతుంటే అడ్డుకోవడం ఏమిటని నాయకులు ప్రశ్నించారు. దీంతో ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. ప్రస్తుతం డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నివాసంలో లేరని, ఆయన ఇక్కడకు వచ్చినప్పుడు కలిసేందుకు అవకాశం కల్పిస్తామని ఉన్నతాధికారులు హామీ ఇవ్వడంతో వారు వెనుతిరిగారు. కార్యక్రమంలో మాల సంఘాల రాష్ట్ర జేఏసీ చైర్మన్ పండు అశోక్‌కుమార్, నాయకులు మారెళ్ల సోమరాజు, బత్తిన శామ్యూల్, ఖండవిల్లి లోవరాజు, లింగం శివప్రసాద్, బంగా సతీష్, కొంగు నూకరాజు, వేళంగి వెంకటేష్, మహేంద్రాడ సింహాచలం, పెదపాటి రాజేష్, ఉలవల భూషణం, వజ్రపు బాబీ, దారా వెంకట్రావు, దడాల నూకరాజు, దిమ్మెల స్టీఫెన్ తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ త్యాగాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి

● భగత్‌సింగ్, రాజుగురు, సుఖదేవ్ వర్ధంతి



పిఠాపురంలో భగత్ సింగ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సీపీఎం, వివిధ సంఘాల నాయకులు

పిఠాపురం, మార్చి 23(ఆంధ్రజ్యోతి): దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన భగత్‌సింగ్‌ను యువత స్ఫూర్తిగా తీసుకుని దేశాభివృద్ధికి పాటుపడాలని సీపీఎం, ప్రజాసంఘాల నాయకులు పిలుపునిచ్చారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన భగత్‌సింగ్, రాజు గురు, సుఖదేవ్‌ల 94వ వర్ధంతిని పిఠాపురం పట్టణంలో ఆదివారం నిర్వహించారు. సీపీఎం కార్యాలయం సెంటర్‌లోగల భగత్‌సింగ్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం, ప్రజాసంఘాల నాయకులు కుంచే చినబ్బాయి, కోనేటి రాజు, నాగేశ్వరరావు, సత్యనారాయణ, వీరబాబు, మణి, రాజ్యలక్ష్మి, సూర్యనారాయణ, నాగు, తులసి, శ్రీను, సూరిబాబు, బాలాజీ, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

దేశం కోసం ప్రాణత్యాగం చేసిన విప్లవ వీరుడు భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని సహృదయ మిత్రమండలి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తోట శ్రీనివాస్, సీహెచ్.సతీష్‌లు సూచించారు. భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా పిఠాపురం పట్టణంలోని యానాదుల కాలనీలో గల విగ్రహానికి వారు ఆదివారం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మిత్రమండలి ప్రతినిధులు, యానాదులకాలనీ యూత్ పాల్గొన్నారు.

భగత్‌సింగ్ ఆశయాలకు పాటుపడదాం

గొల్లప్రోలు: భగత్‌సింగ్ ఆశయాలు కోసం పాటుపడదామని అఖిలభారత కార్మిక సంఘాల సమాఖ్య ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కుంచే అంజిబాబు అన్నారు. గొల్లప్రోలు పట్టణంలోని జగనన్న కాలనీలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో భగత్‌సింగ్ 94వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి సమాఖ్య ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు డి.నారాయణమూర్తి, గొర్ల శివ, వేగిశెట్టి గణేష్, బల్ల సోమరాజు, కేశవరపు రాజు, కె.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురంలో భగత్‌సింగ్ వర్ధంతి

పెద్దాపురం: స్థానిక నువ్వులగుంట వీధిలో ఉన్న భగత్‌సింగ్ విగ్రహంవద్ద పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో భగత్‌సింగ్‌రాజ్ గురు సుఖదేవుల వర్ధంతి సభ రొంగల అరుణ అధ్యక్షతన నిర్వహించారు. సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షుడు జోష్యుల కృష్ణబాబు మాట్లాడుతూ దేశ స్వాంత్ర్యం కోసం అతి చిన్న వయస్సులో ప్రాణాలు అర్పించిన అనేకమంది మహోన్నత వ్యక్తుల్లో అగ్రగన్యుడు భగత్‌సింగ్ అన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ గౌరవాధ్యక్షుడు బుద్ధ శ్రీనివాస్, సీఐ టీయూ మండల అధ్యక్షుడు గడిగట్ల సత్తిబాబు, ప్రజానాట్య మండలి కార్యదర్శి రొంగల వీర్రాజు, దారపురెడ్డి కృష్ణ, డి.సత్యనారాయణ, వీసీసీ మణికంఠ, యోగేష్, సూర్యకళ, మణికంఠ తదితరులు పాల్గొన్నారు. పెద్దాపురం మండలం పులిమేరు గ్రామం ఎస్సీపేటలో ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం, అఖిలభారత కార్మిక సంఘాల సమాఖ్య, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతి నిర్వహించారు. ఏపీఆర్ సీఎస్ గ్రామకమిటీ అధ్యక్షుడు నారాయణరావు, పునయ్య, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు, డి.నారాయణమూర్తి, బొచ్చ ఏసు, డి.సురేష్ పాల్గొన్నారు.

భగత్ సింగ్‌కి ఘన నివాళి

కలెక్టరేట్(కాకినాడ): భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ కాకినాడజిల్లా విద్యావైజ్ఞానిక శిక్షణ తరగతులలో భాగంగా కచ్చేరిపేట యూటీఎఫ్ హోంలో జిల్లా గర్ల్స్ కన్వీనర్ చిన్ని అధ్యక్షతన ప్రారంభమయ్యాయి. భగత్‌సింగ్, రాజ్‌గుర్, సుఖదేవ్ వర్ధంతి సందర్భంగా భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి టి.రాజా మాట్లాడుతూ భగత్‌సింగ్ స్ఫూర్తితో నేటి విద్యార్థులు పోరాడాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గంగా సూరిబాబు, జిల్లా నాయకులు లోవరాజు, అరుణ్, గోపాలకృష్ణ, జైరాం పాల్గొన్నారు.

మతోన్మాద రాజకీయాలకు వ్యతిరేకంగా పోరాడాలి

సామర్లకోట: స్వాతంత్ర్యం కోసం తన ప్రాణాలను త్యాగం చేసిన సాహిద్ భగత్ సింగ్ రాజ్‌గురుసుఖ్‌దేవ్‌ల ఆశయాల సాధనకు అందరూ కృషిచేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఉమ్మడి తూర్పుజిల్లాల అధ్యక్షుడు వల్లూరి రాజబాబు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక అమ్మాణమ్మ నాయుడు కాలనీ ఆవరణలో భగత్ సింగ్ వర్ధంతి వేడుకలు రైతుకూలీ సంఘ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కాకినాడ జిల్లా అధ్యక్షులు కర్నాకుల రామలింగేశ్వరరావు, దేశెట్టి సురేష్, అనుష, దుర్గాభవాని, శాంతి, డి.సురేష్ పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

భగత్‌సింగ్ రాజ్‌గురు సుఖ్‌దేవ్‌ల 94వ వర్ధంతి సందర్భంగా ఆదివారం సామర్లకోట పట్టణ సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.ప్రసాదరావు ప్రారంభించారు.



జిల్లా ఎస్పీ బిందుమాధవ్‌ను సత్కరించి చిత్రపటం బహూకరిస్తున్న ఫెడరేషన్ ప్రతినిధులు

'చేరువ' వినూత్న కార్యక్రమానికి

శ్రీకారంచుట్టిన ఎస్పీ అభినందనీయులు

● యూపీఈఐఎఫ్ రాష్ట్ర లీగల్ అడ్వయిజర్ శ్రీవిజయ్

కాకినాడసిటీ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మొదటిసారిగా పోలీస్‌శాఖ ద్వారా 'చేరువ' వంటి వినూత్న కార్యక్రమానికి శ్రీకా రం చుట్టిన జిల్లా ఎస్పీ బిందుమాధవ్ అభి నందనీయులని యునైటెడ్ ప్రైవేట్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఫెడరేషన్ (యూపీఈ ఐఎఫ్) రాష్ట్ర లీగల్ అడ్వయిజర్ మతుకుమిల్లి శ్రీవిజయ్ పేర్కొన్నారు. ఈమేరకు స్థానిక అశోక్‌నగర్‌లోని కార్యాలయంలో ఆదివారం శ్రీవిజయ్ మీడియాతో మాట్లాడుతూ చేరువ కార్యక్రమంతో జిల్లా ఎస్పీ ప్రైవేట్ విద్యాసంస్థలకు మరింత చేరువయ్యారన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు, ఉపాధ్యాయులలో స్ఫూర్తిని నింపారన్నారు. ఫెడరేషన్ చైర్మన్ దాసరి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇటువంటి కార్యక్ర మాలు ద్వారా సమాజంలో పెనుమార్పులు చోటుచేసుకుంటామయన్నారు. కరస్పాండెంట్లు, ఉపాధ్యాయుల నుంచి సలహాలు, సూచనలు తీసుకోవడం మంచి పరిణామమన్నారు. ఫెడరేషన్ తరపున జిల్లా ఎస్పీని కలిసి శాలువతో సత్కరించి చిత్రపటం బహూకరించారు. కార్యక్రమంలో ఫెడరేషన్ గౌరవాధ్యక్షుడు సామా ఈశ్వరరావు, పలువురు కరస్పాండెంట్లు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పద్మశ్రీకి మహిళా సంఘాల సత్కారం



ఎమ్మెల్సీ పద్మశ్రీని సత్కరిస్తున్న మహిళా సంఘాల ప్రతినిధులు

కాకినాడ సిటీ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రాజధానిలో జరిగిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల క్రీడాపోటీల్లో పలు విభాగాల్లో విన్నర్‌గా ట్రోఫీలు అందుకున్న ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీని మహిళా సంఘాల ప్రతినిధులు శాలువతో సత్కరించి మొక్క బహూకరించారు. ఈమేరకు ఆది వారం ఎమ్మెల్సీ పద్మశ్రీని ఆమె నివాసంలో కలిసిన మ హిళా సంఘాల ప్రతి నిధులు మాట్లాడుతూ ఈ క్రీడాపోటీల్లో పలు విభాగాల్లో ఎమ్మెల్సీ పద్మశ్రీ సత్తాచాటి రాష్ట్రంలో కాకినాడ పేరును చాటారని అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గోడి సత్యవతి, మహిళా సంఘాల ప్రతినిధులు ఓలేటి మం జుల, పి.సుబ్బలక్ష్మి, జి.సూర్యకళ, నాగమణి, ఎం.విజ యలక్ష్మి, శైలజ, బేబి పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై క్షేత్రస్థాయి ప్రచారం అవసరం

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు

సామర్లకోట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీ ప్రభుత్వంలో ప్రధాని నరేంద్ర మోదీ అమలు చేస్తున్న పలు ప్రజాసంక్షేమ పథకాలపై క్షేత్రస్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించాలని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు పేర్కొన్నా రు. ఆదివారం సాయంత్రం సామర్లకోటలో నూతనంగా ఏర్పాటుచేసిన పట్టణ బీజేపీ కార్యాలయాన్ని జిల్లా అధ్య క్షుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా బీజేపీ కార్యకర్తలనుద్దేశించి ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ప్రతీ కార్యకర్త, నాయకులు కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు డాక్టర్ గౌరకపూడి చిన్నయ్యదొర, సుంకవిల్లి బాపిరాజు, వల్లూరి బుల్లియ్య, కొక్కిలి గంగరాజు, పుప్పాల నాగగోవిందు, కూనంశెట్టి అర్జునుడు తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్ మాసం

● కాకినాడ సిటీ ఎమ్మెల్యే కొండబాబు

కాకినాడసిటీ, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మత సామరస్యానికి ప్రతీక రంజాన్ మాసమని, క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనలకు ప్రతీకని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. స్థానిక సాంబమూర్తినగర్ రెవెన్యూకాలనీలోని హబీబియా మసీద్‌లో ఆదివారం సాయంత్రం నిర్వహించిన ఇఫ్తార్ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్షలు చేస్తూ ఇతరులకు సాయం అందిస్తూ పండుగ జరుపుకుంటారన్నారు. అల్లా ఆశీస్సులతో ప్రతిఇంట సుఖసంతోషాలు కలగాలని ప్రార్థన చేశారు. ముందుగా టీడీపీ జిల్లా మైనారిటీ సెల్ మాజీ అధ్యక్షుడు ఎంఏ తాజుద్దీన్ కుటుంబ సభ్యుల సహకారంలో 200మంది, పేదలకు రంజాన్ కానుకగా నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హబీబియా మసీదు కమిటీ అధ్యక్షుడు జిలాని సాబ్, టీడీపీ నాయకులు వొమ్మి బాలాజీ, తుమ్మల రమేష్, మైనారిటీ నాయకులు ఎస్‌కే రహీమ్, ఎండీ అన్సర్, ఎండీ ఖాన్, ఆశ్రిఫ్, ఆలీ, ఎస్‌కే కస్మూర్ తదితరులు పాల్గొన్నారు.



పేదలకు రంజాన్ కానుకగా నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కొండబాబు

విభిన్న ప్రతిభావంతులకు ఆటపాటలతో బోధన



విద్యాబోధనపై శిక్షణ ఇస్తున్న సీడీపీవో దుర్గాదేవి

గొల్లప్రోలురూరల్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): చిన్నారుల్లో విభిన్న ప్రతిభావంతులను గుర్తించి వారికి ఆటపాటల ద్వారా విద్యాబోధన సాగించాలని ఐసీడీఎస్ పిఠాపురం ప్రాజెక్టు సీడీపీవో సీహెచ్ఎస్‌కే దుర్గాదేవి సూచించారు. గొల్లప్రోలు మండలం వన్నెపూడి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ్ బి, పడాయి బి శిక్షణా కార్యక్రమంలో భాగంగా పిల్లల్లో వికలాంగత్వం, అందులో రకాలు ఏమిటి, వారిని ఎలా స్ర్కీనింగ్ చేయాలి, ఎలా గుర్తించాలి తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. వీరి విషయంలో తీసుకోవాల్సిన ప్రత్యేక శ్రద్ధ, తల్లిదండ్రులకు ఏ విధమైన సూచనలు ఇవ్వాలని, బోధనలో మెళకువలు తదితర అంశాలు గురించి పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు.

ఐదేళ్లుగా అందని జీతం

● కరప పీహెచ్‌సీలో ఓ కంటింజెంట్ వర్కర్ కన్నీటి వ్యథ...!



శీరం దుర్గ

కరప, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): సకాలంలో జీతం రాకపోతే సగటు వేతన జీవి పడే కష్టం అంత ఇంత కాదు. అలాంటి ది ఐదేళ్లుగా జీతం అందకపోతే.. అదీ భర్తను కోల్పోయి ఎటువంటి ఆధారం లేని ఒక నిరుపేద ఒంటరి మహిళకు ఆ దుస్థితి ఎదురైతే...ఎలా ఉంటుందో ఊహించుకోవడం కూడా కష్టమే..! కరప ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఫుల్‌టైమ్ కంటింజెంట్ వర్కర్‌గా పనిచేస్తున్న శీరం దుర్గ ఇటువంటి విపత్కర పరిస్థితిని ఎదుర్కొంటూ ఏళ్లతరబడి తనకు రావాల్సిన వేతనం కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తోంది. ఈ క్రమంలో కుటుంబపోషణ భారంకావడంతో తన ఇద్దరి బిడ్డలతో చదువు మాన్పించింది. వారు ప్రస్తుతం కాకినాడలోని ఒక వాటర్‌ప్లాంట్‌లో పనిచేస్తూ కుటుంబానికి ఆసరాగా నిలుస్తున్నారు. కరప గ్రామానికి చెందిన శీరందుర్గ 2006 నుంచి స్థానిక పీహెచ్‌సీలో తన మేనత్త నూకమ్మ స్థానంలో స్వీపర్‌గా పనిచేస్తుంది. 2013లో కంటింజెంట్ వర్కర్‌గా ఆర్డర్ రావడంతో నెలకు రూ.2,600ల జీతంతో విధులు నిర్వహిస్తుంది. 2020లో ఫుల్‌టైమ్ కంటింజెంట్ వర్కర్‌గా నెలకు రూ.16వేల వేతనంతో ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీచేశారు. అప్పటినుంచి జీతం అందక ఆమె తీవ్ర ఇబ్బందులు పడుతుంది. ఉండడానికి ఇల్లు లేక పీహెచ్‌సీ ఆవరణలోని తుప్పల్లో పాడుబడిన క్వార్టర్స్‌లో తల దాచుకుంటుంది. భర్త సత్తిబాబు 2018లో రోడ్డుప్రమాదంలో మృతిచెందడంతో ఆర్థిక ఇబ్బందులు ఎక్కువయ్యాయి. ఇద్దరి బిడ్డలను ఇంటర్ చదువుతో ఆపించి వారి కాయకష్టంతో కుటుంబాన్ని లాక్కొస్తుంది. 2020 జనవరి నుంచి 2025 మార్చి వరకు అంటే 63 నెలలుగా రూ.10.08లక్షల మేర జీతం ఆమెకు రావాల్సిఉంది. దీనిపై బడ్జెట్ విడుదలచేసి దుర్గకు పెండింగ్ జీతం మొత్తం చెల్లించాలని విజయవాడ డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ కమీషనరేట్ నుంచి కాకినాడ జిల్లావైద్యఆరోగ్య శాఖ కార్యాలయానికి గత ఏడాది అక్టోబరులో ఉత్తర్వులు అందాయి. కానీ నేటికీ ఆమెకు ఒక్క పైస జీతం కూడా అందక ఆర్థిక ఇబ్బందులకు గురవుతోంది.

పట్టాలు ఇచ్చారు..స్థలాలు ఎక్కడ..

● గ్రామ సమస్యలపై అధికారులను ప్రశ్నించిన మహిళా ప్రజాప్రతినిధులు


● కొత్తపల్లి మండల సర్వసభ్యసమావేశం



హైవోల్టేజీ విద్యుత్ తీగల మార్పుపై కొత్తపల్లి ఏఈని ప్రశ్నిస్తున్న కొండెవరం ఎంపీటీసీ సత్తిబాబు

కొత్తపల్లి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): గ్రామంలో జగన్న ఇళ్ల పట్టాలు ఇచ్చిన స్థలాలు ఎక్కడ చూపలేదని, పారిశుధ్య పనులు చేపట్టక గ్రామం చెత్తతో నిండిపోతున్నా చర్యలు చేపట్టడంలేదని పలువురు మహిళా ప్రజాప్రతినిధులు సంబంధిత అధికారులను నిలదీశారు. ఆదివారం జరిగిన కొత్తపల్లి మండల సర్వసభ్యసమావేశానికి ఎంపీపీ కారే సుధ అధ్యక్షత వహించారు. వెసీపీ ప్రభుత్వంలో పేదలకు జగనన్న ఇళ్ల పట్టాలు మంజూరు చేశారని, ఇప్పటికీ స్థలాలు ఎందుచేత కేటాయించలేదని పాత ఇసుకపల్లి సర్పంచ్ సన్నిబోయిన రిబ్కా అధికారులను ప్రశ్నించారు. తమ గ్రామంలో ఎక్కడకక్కడ చెత్త దర్శనమిస్తుందని దీంతో ప్రజలు అనారోగ్యాల బారినపడే ప్రమాదం ఉందని నాగులాపల్లి ఎంపీటీసీ అనిశెట్టి సుభాషిణి తెలిపారు. గుట్టలు, గుట్టలుగా పోగుబడిపోయిన చెత్తను ఏ కారణంచేత తొలగించే చర్యలు చేపట్టలేదని ఆమె అధికారులను నిలదీశారు. ఎస్సీ, ఎస్టీ ఏరియాల్లో సోలార్‌రూఫ్‌ల ఏర్పాటుకు ప్రభు త్వం చర్యలు చేపట్టిందని ఏపీఈపీడీసీఎల్ ఏఈఈ ముమ్మిడి శ్రీనివాసరావు తెలిపారు. రూఫ్‌ల ఏర్పాటుకు పంచాయతీల్లో కమ్యూనల్ సైట్‌లు మంజూరుకు స్థానిక ప్రజా ప్రతినిధులు సహకరించాలని కోరారు. గృహకరెంటు వినియోగదారులు అధిక విద్యుత్ వాడకాన్ని రాయితీ క్రమబద్ధీకరణ చేసుకునేందుకు జూన్30 వరకు గడువు ఇచ్చిందన్నారు. దీని ప్రకారం కిలో వాట్‌కు 2వేలు చెల్లించడానికి బదులు వెయ్యిరూపాయలు చొప్పన డిపాజిట్ చెల్లించాలన్నారు. ఇందిరానగర్‌కాలనీ పైనుంచి వెళ్లే హైవోల్టేజి విద్యుత్ తీగలను మార్చాలని అధికారులను ప్రాధేయపడినా పట్టించుకోవడం లేదని విద్యుత్‌శాఖ తీరుపై ఎంపీటీసీ దుళ్ల సత్తిబాబు ఆవేదన చెందారు. వైస్ ఎంపీపీ చెట్టుబత్తిన సురేష్‌కుమార్, జెడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్, ఎంపీడీవో పి.రవికుమార్, పిఠాపురం ఎక్సైజ్ సీఐ శివరామరాజు, తదితర అధి కారులు సమావేశంలో ప్రసంగించారు.

వాడివేడిగా పెద్దాపురం మండల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీలత

పెద్దాపురం, మార్చి 23(ఆంధ్రజ్యోతి): పెద్దాపురం మండల పరిషత్ సర్వసభ సమావేశం ఆదివారం ఎంపీపీ పెంకే సత్యవతి అధ్యక్షతన జరిగింది. వాడివేడిగా జరిగిన సమావేశంలో అధికారులు సమీక్షలో విద్యాశాఖ, ఐసీడీఎస్, వెలుగు శాఖలపై ప్రజాప్రతినిధులు ప్రశ్నల వర్షం కురిపించారు. పనితీరు మార్చుకోవాలంటూ ఆయా శాఖల అధికారులపై ధ్వజమెత్తారు. గ్రామాల్లో డ్వాక్రా మహిళలకు ఇస్తున్న ముద్ర రుణాల మంజూరులో వెలుగు, బ్యాంక్ అధికారులు కుమ్మక్కై ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వరా, కనీసం ఏ గ్రామానికి ఎన్ని ముద్రరుణాలు, ఎన్ని గ్రూపులకు ఇస్తున్నారో తెలపకుండానే ఆ శాఖ సిబ్బంది, బ్యాంక్ సిబ్బంది కుమ్మక్కై రుణాల మంజూరులో అవకతవకలకు పాల్పడుతున్నారంటూ ప్రజాప్రతినిధులు మండిపడ్డారు.విద్యార్థులు తక్కువగా ఉన్నారంటూ పాఠశాలల విలీనంపేరుతో తరగతుల నిర్వాహణ, విద్యాశాఖ అధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీడీవో శ్రీలలిత, ఏవో సంజయ్‌కుమార్, ఏపీవో సుధీర్, సీడీపీవో ఉష, ఎంఈవోలు చౌదరి, శర్మ, సర్పంచ్‌లు, కోఆప్షన్ సభ్యులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నేడు కాకినాడలో జాబ్‌మేళాకు హాజరుకండి

● ఎమ్మెల్యే చినరాజప్ప



సామర్లకోట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు వికాస ఆధ్వర్యంలో కాకినాడ కలెక్టరేట్ నందు ఈనెల 24 సోమవారం ఉదయం 9గంటల నుంచి విర్టుసా(వర్కింగ్ ఆఫ్ గూగుల్) నందు ఉద్యో గాకాశాల కోసం అర్హులైన అభ్యర్థుల ప్రతిభా సామర్థ్యాల ఆధారంగా జాబ్‌మేళా నిర్వహించనున్నందున ఏదైనా ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్(డిగ్రీ) విద్యార్హతలు కలిగిన యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పిలుపునిచ్చారు. ఆదివారం విలేకరులతో ఎమ్మెల్యే చినరాజప్ప మాట్లాడుతూ ఎనాలిస్ట్ పోస్టుల కోసం ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నారన్నారు. వికాస సంస్థప్రతినిధులు 7799376111, 7799376444 లకు సంప్రదించాలని ఎమ్మెల్యే చినరాజప్ప కోరారు.

దొమ్మేటి ఆశయ సాధనకు కృషి చేయాలి

▸రాష్ట్ర బీసీ సంఘం ఉపాధ్యక్షుడు యనమదల రవి

కాకినాడ సిటీ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): శెట్టిబలిజ జాతిపిత దొమ్మేటి వెంకటరెడ్డి ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని రాష్ట్ర బీసీ సంఘం ఉపాధ్యక్షుడు యనమదల రవి పేర్కొన్నారు. దివంగత దొమ్మేటి వెంకట రెడ్డి 172వ జయంతి సందర్భంగా రాష్ట్ర బీసీ సంఘం ఆధ్వర్యాన ఆదివారం స్థానిక జగన్నా ధపురంలో ఆరావళి స్వచ్ఛంద సేవాసంస్థ నిర్వ హణలోని వృద్ధుల అనాథ ఆశ్రమంలో వృద్ధులకు పండ్లు, స్వీట్లు పంపిణీచేసి భోజన ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర బీసీ సంఘం ఉపాధ్యక్షుడు రవి, రాష్ట్ర కార్యదర్శి పెంకేరాజు, ఉప కార్యదర్శి వాసంశెట్టి త్రిమూర్తులు, రాష్ట్ర యువత అధ్యక్షుడు అనసూరి సతీష్, జిల్లా అధ్యక్షుడు కొప్పిశెట్టి చంద్రమౌళి మాట్లాడుతూ మంత్రి వాసంశెట్టి సుభాష్ పిలుపుమేరకు ఈ కార్యక్రమం చేస్తున్నామన్నారు. తొలుత దొమ్మేటి వెంకటరెడ్డి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు పెంకే గోపి, గుత్తుల మోహర్‌ప్రసాద్, పెంకే నాగేశ్వరరావు, విత్తనాల రమణ, పెంకే శివ, పాలిక శ్రీను పాల్గొన్నారు.

మూడోరోజుకు రిలే దీక్ష

కరప, మార్చి 23(ఆంధ్రజ్యోతి): కూరాడలో చర్చి నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ హైందవ సైన్యం ఆధ్వర్యంలో గ్రామస్తులు చేపడుతున్న రిలే నిరాహారదీక్ష మూడోరోజుకు చేరింది. ఈ సందర్భంగా హైందవ సైన్యం జిల్లా అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటరాజు మాట్లాడుతూ ఫాస్టర్‌కు అండగా అధికారులు ఉన్నారని, వారి మద్దతుతోనే హిందువుల ఇళ్ల మధ్య చర్చి నిర్మాణానికి పూనుకుంటున్నారని ఆరోపించారు. అక్రమంగా చర్చి నిర్మిస్తే ఉపేక్షించేదిలేదని ఎంతటి ఆందోళనకైనా సిద్ధమేనని స్పష్టం చేశారు. కాగా దీక్షాశిబిరం వద్దకు స్థానిక పంచాయతీ కార్యదర్శి మునగాల దుర్గాప్రసాద్ వెళ్లి ఆందోళనకారులతో మాట్లాడారు. సదరు ఫాస్టర్‌కు ఇంటి నిర్మాణానికి మాత్రమే అనుమతులు ఇచ్చామని చెబుతూ దానికి సంబంధించిన పత్రాలు,పాస్టర్‌కు పంపించిన నోటీసులనువారికి చూపించారు. ఇందులో అధికారుల ప్రమే యం ఏమీలేదని, ఆందోళన విరమించాలని సూచించారు.

నిరుపేదల వైద్యానికి భరోసా సీఎం సహాయ నిధి : ఎమ్మెల్యే నానాజీ



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే పంతం నానాజీ

సర్పవరం జంక్షన్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): నిరుపేదల ఆరోగ్యం, వైద్యఖర్చులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే పంతం నానాజీ అన్నారు. ఆదివారం గొడారిగుంటలో ఎమ్మెల్యే నివాసంవద్ద 6గురు లబ్ధిదారులకు రూ.11,97,673 లక్షల రూపాయల చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శస్త్రచికిత్సలు చేయించుకునేందుకు పేదరికం అడ్డుకారాదనే ఉద్దేశంతో సీఎం చంద్రబాబు సత్వరంగా ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా నిధులు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కరెడ్ల గోవిందు, శిరంగు శ్రీనివాసరావు, ముద్దన ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత



ఉప్పాడ,అమీనబాద్‌లో చెక్కులను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యేవర్మ

కొత్తపల్లి, మార్చి23(ఆంధ్రజ్యోతి): ఉప్పాడ, అమీనబాద్ గ్రామాల్లో టీడీపీ కార్యకర్తలకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి(సీఎంఆర్ఎఫ్) చెక్కులను టీడీపీ రాష్ట్రఅధికారప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్‌వర్మ ఆదివారం ఆయా కుటుంబాలకు అందజేశారు. అమీనబాద్‌కు చెందిన శీకోటి స్రవంతి కుటుంబానికి రూ.40,650ల చెక్, ఉప్పాడకు చెందిన సూరాడ కామేశ్వరరావుకు రూ.1,05343రూ చెక్కును అందజేశారు. టీడీపీ కొత్తపల్లి మండలశాఖ అధ్యక్షుడు అనిశెట్టి సత్యానందరెడ్డి, ఎంపీటీసీ బాదిన నాగేశ్వరరావు, శీకోటి నానా జీ, సనపయ్య, చోడిపల్లి ప్రసాద్, కోడ జగన్నాధం తదితర కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

200 మందికి కంటి పరీక్షలు

కాకినాడ సిటీ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక 43వ డివిజన్ ట్రెజరీ కాలనీ పార్కులో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 200 మందికి కంటి పరీక్షలు జరిపి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ శిబిరాన్ని దిలీప్‌విజన్, పార్థ డెంటల్ హాస్పటల్ నేతృ త్వంలో ట్రెజరీ కాలనీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పి.రాజారాంజీ ఆధ్వర్యాన నిర్వహించారు. శిబిరం నిర్వహణకు అసోసియేషన్ కార్యదర్శి జి.రాజేష్, పి.సత్యనారాయణ, పండు, వై.సత్యనారాయణ, సురేష్ సహకారం అందించారు. 43వ డివిజన్ మాజీ కార్పొరేటర్ జేడీ పవన్ కుమార్, నాయకులు పిడకా శేషు, నవీన్, గోవింద రాజులు పాల్గొన్నారు.

యనమలను కలిసిన చినరాజప్ప

తునిరూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : మాజీమంత్రి, టీడీపీ సీనియర్ నాయకుడు యనమల రామకృష్ణుడుని మాజీహోం మంత్రి, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తేటగుంట టీడీపీ క్యాంప్ కార్యాలయంలో ఆదివారం కలిశారు. ఈయన వెంట పెద్దాపురానికి చెందిన పలువురు టీడీపీ ఉన్నారు.



తేటగుంటలో యనమలను కలిసిన ఎమ్మెల్యే చినరాజప్ప

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

కస్తూరిబాలో పడకేసిన నాడు - నేడు పనులు





ఊచలు మాత్రమే వేసి నిలిపివేసిన నాడు - నేడు అదనపు తరగతుల భవనం

పాఠశాలలోని ఒక గదిలో గడ్డకట్టిన సిమెంట్ బస్తాలు

● గడ్డ కట్టిన సిమెంట్ బస్తాలు

వై.రామవరం, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ఒకటా రెండా 500కు పైగా ప్రభుత్వ భవన నిర్మాణానికి ఉపయోగించాల్సిన సిమెంట్ బస్తాలు గడ్డకట్టి రాళ్లుగా మారిపోయాయి. ప్రభుత్వ సొమ్ములు దుర్వినియోగం చేస్తున్నారనడానికి ఇదే నిదర్శనం. అల్లూరి జిల్లా వై.రామవరం మండలం తోటకూరపాలెం కస్తూరిబా బాలికల విద్యాలయంలోని పెద్దసంఖ్యలో సిమెంటు బస్తాలు నిరుపయోగమయ్యాయి. 2023-24విద్యా సంవత్సరంలో నాటి వైఎస్సార్ ప్రభుత్వంలో నాడు నేడు పనుల్లో పాఠశాలకు అదనపు తరగతుల భవనం మంజూరైంది. ఈ భవనం భూమి నుంచి ఊచలు మాత్రమే వేసి పనులు ఆపేశారు. దీనికి వాడాల్సిన సిమెంట్ బస్తాలే ఇలా పాడైపోయాయి. వీటిని కనీసం వేరే పనులకు వినియోగించి ఉంటే కనీసం ప్రభుత్వ నిధులకు రక్షణ కలిగి ఉండేది. అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంపై విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు విమర్శలు చేస్తున్నారు. అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పోలవరం పరిహారం చెల్లింపుల్లో చర్యలేవి!

సీపీఎం కార్యదర్శి పల్లపు వెంకట్



మాట్లాడుతున్న ఆ పార్టీ కార్యదర్శి పల్లపు వెంకట్

చింతూరు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): పోలవరం ఏపీ రాష్ట్ర ప్రజల జీవనాడంటూ పేర్కొంటున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వాసితులకు మాత్రం న్యాయం చేయడంలో విఫలమవుతున్నాయని సీపీఎం చింతూరు మండల కార్యదర్శి పల్లపు వెంకట్ అన్నారు. ఆదివారం చింతూరు పార్టీ కార్యాలయంలో ఆయన ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం పోలవరం నిర్వాసితులకు న్యాయం చేస్తామని, పరిహారం చెల్లిస్తామని, పునరావాసం కల్పిస్తామని హామీలు ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు కావస్తున్నప్పటికీ ఎటువంటి చెల్లింపులు జరగలేదన్నారు. ఇరవై ఏళ్లుగా ప్రభుత్వాల తీరు ఇదే తీరున సాగుతుందన్నారు. ఇప్పటివరకు పునరావాసంపై స్పష్టత లేదన్నారు. ప్రకటనలు, సమావేశాలు, గ్రామ కమిటీలు అంటూ కాలయాపన చేస్తున్నారన్నారు. బడ్జెట్‌లో కేటాయింపులు మాత్రం లేవన్నారు. ఈమేరకు ప్రతి నిర్వాసితుడు తనకు న్యాయపరంగా అందాల్సిన పరిహారం కోసం పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ఈమేరకు ఈనెల26న చింతూరు ఐటీడీఏ కార్యాలయం ఎదుట పార్టీ పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయాలన్న డిమాండ్‌తో ధర్నా చేపట్ట నున్నట్లు వెంకట్ పేర్కొన్నారు. ఈమేరకు ప్రతి నిర్వాసితుడు కదలిరావాలని ఆయన కోరారు. నాయకులు సీసం సురేష్, పొడియం లక్ష్మణ్, మల్లం సుబ్బమ్మ, మడకం చిన్నయ్య, చింతారాంబాబు, కారం సుబ్బారావు, ముర్రం రంగమ్మ పాల్గొన్నారు.

ముగిసిన అష్టలక్ష్మీ యాగం



భక్తులపై సహిత జలాన్ని చల్లుతున్న పీఠాదిపతి రాఘనాథాచార్యులు

ఎటపాక,మార్చి 23(ఆంధ్రజ్యోతి): లోక కల్యాణం కోసం ఎటపాక మండలం ఉప్పగుండాల సమీపంలో ఈనెల12న అంకురార్పణతో ప్రారంభమైన శ్రీఅష్టలక్ష్మీ యాగం ఆదివారం మహాకుంభ ప్రోక్షణతో ఘనంగా ముగిసింది. శనివారం మధ్యాహ్నం మహాపూర్ణాహుతి అనంతరం రాత్రి శ్రీలక్ష్మీనారాయణ కల్యాణం నిర్వహించారు. పీఠాధిపతి పీతాంబరం రఘునాథాచార్యులు పర్యవేక్షణలో యజ్ఞబ్రహ్మ రఘపుంగన ఆచార్య, రుత్వికులు కల్యాణ తంతును వైభవంగా జరిపించారు. చివరి రోజున మహాకుంభ ప్రోక్షణ కార్యక్రమం నిర్వహించి, వేద మంత్ర సహిత జలాన్ని పీతాంబరం రఘనాథాచార్యులు భక్తులపై చల్లి ఆశీర్వదించారు. యాగంలో చివరి ఘట్టం ఆదివారంతో ముగిసింది. చివరి రోజు కార్యక్రమంలో తహశీల్దార్ కారం సుబ్బారావు దంపతులు పాల్గొన్నారు.

భానుడి భగభగలు



ఎండ తీవ్రతకు నిర్మానుషంగా మారిన రోడ్డు

మోతుగూడెం, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మోతుగూడెంలో మార్చి నెలలోనే ఎండలు భయపెట్టిస్తున్నాయి. ఉష్ణోగ్రతలు మార్చిలో 36 డిగ్రీలు నమోదవుతున్నాయి. రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరగడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఎండ తీవ్రతకు మధ్యాహ్నం సమయంలో బయటకు రావాలంటే జంకుతున్నారు. మోతుగూడెంలో వారం రోజులుగా 36నుంచి 40 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రానున్న రోజుల్లో ఎండ తీవ్రత మరింత ఎక్కువగా ఉంటుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఆదివారం 39 డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదు కావడంతో మార్కెట్ సెంటర్ సంత వెలవెలపోయింది.

అడవిపై అధికారం ఆదివాసులదే

ఆదివాసీ జేఏసీ డిమాండ్

మారేడుమిల్లి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): అటవీ మీద అధికారం ఆదివాసులకే ఉండాలని ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ జేఏసీ డిమాండ్ చేసింది. ఆదివారం మారేడుమిల్లి మండలం దేవరపల్లిలో ఆదివాసీ జేఏసీ రాష్ట్రస్థాయి విస్తృత సమావేశం జిల్లా కన్వీనర్ రామారావుదొర అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా పలువురు జేఏసీ నాయకులు మాట్లాడుతూ అటవీశాఖ ఆగడాలు నానాటికి పెరిగిపోతున్నాయని, వంటచెరుకు కోసం అడవి నుంచి తెచ్చుకున్న వారిని చెక్‌పోస్టులు పెట్టి డబ్బులు వసూలు చేస్తున్నారని, కాల్వలో ఇసుకకు సైతం సొమ్ములు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. మన్యంలో టూరిజం పేరుతో రిసార్ట్స్ కట్టి ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలకు ఆటంకం కలిగించే విధంగా ఉన్నాయన్నారు. మారేడుమిల్లి అటవీ ప్రాంతం అభయారణ్యంగా ప్రకటించడంవల్ల ఈ ప్రాంత ఆదివాసీలు నిర్వాసితులవుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. 5వ షెడ్యూల్ ప్రాంతంలో పీసా చట్టం ప్రకారం గ్రామసభ తీర్మానమే అత్యున్నతమైనదన్నారు. ఆదివాసీలకు కావాల్సిన వాటిని పీసా చట్టం ప్రకారం గ్రామ సభలో తీర్మానం చేసుకుని వాటిని సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఏపీ ఆదివాసీ జేసీ రాష్ట్ర వైస్ చైర్మన్ మొడియం శ్రీనివాసరావు, మొట్టడం రాజబాబు, బంగారు వెంకటేశ్వర్లు, బెల్లం శేఖర్, జాతీయ కమిటీ సలహాదారులు మొడియం పండుదొర, రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు కాగల శ్రీనివాస్, తదితర ఆదివాసీ జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

పాపికొండలకు నాలుగు బోట్లు

దేవీపట్నం, మార్చి 23(ఆంధ్రజ్యోతి): పోశమ్మగండి బోటుపాయింట్ నుంచి తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి పర్యాటకులు గోదావరి నదిపై ప్రకృతి అందాలు తిలకించేందుకు గోదావరి పరివాహక ప్రాంతాల మీదుగా ఆదివారం నాలుగు బోట్లలో 240మంది పర్యాటకులు పాపికొండలు వెళ్లారు. ముందుగా మండల పరిధిలో ఉన్నమాతృశ్రీ గండిపోశమ్మ అమ్మవారిని దర్శించుకుని అనంతరం పాపికొండలు వెళ్లి సాయంత్రం వెనుదిరిగారు.

అమ్మవారి ఆలయానికి పోటెత్తిన భక్తులు

మాతృశ్రీ గండిపోశమ్మ అమ్మవారి ఆలయానికి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

ఎటపాకలో పబ్లిక్ గ్రీవెన్స్

ఎటపాక, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ఎటపాక ఎంపీడీవో కార్యాలయంలో ప్రతీ సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ప్రేమ్‌సాగర్ ఓ ప్రకటనలో తెలిపారు. గ్రీవెన్స్ కార్యక్రమానికి మండల అధికారులు అందుబాటులో ఉంటారని, ప్రజలు సమస్యలపై ఫిర్యాదు చేస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతీ సోమవారం గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.



జగ్గంపేటలో భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

భగత్‌సింగ్‌కు ఘన నివాళి

జగ్గంపేట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవుల వర్ధంతి సభ ఆదివారం జగ్గంపేట భగత్‌సింగ్ నగర్‌లో నిర్వహించారు. భగవత్‌సింగ్ చిత్రపటానికి పార్టీ రాష్ట్ర నాయకులు కామ్రేడ్ ఎం.దుర్గాప్రసాద్, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జె.సత్తిబాబు, పి.వెంకట్‌నాయుడు పార్టీ జిల్లా నాయకులు ఎం.యేసు గంట బాలరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ దేశ స్వతంత్రం, సమసమాజ స్థాపన , దోపిడీ లేని సమాజకోసం తమ ప్రాణాలను అతి చిన్న వయస్సులోనే దేశం కోసం అర్పించిన భగత్‌సింగ్, రాజుగురు, సుఖదేవుల ఆకాంక్షలు నెరవేరలేదన్నారు. దేశంలో బీజేపీప్రభుత్వం సామ్రాజ్యవాద కంపెనీలకు దేశ సంపదను ధారాదత్తం చేస్తూ సామ్రాజ్యవాదుల అనుకూల చట్టాలు తీసుకొచ్చి రైతులను రోడ్డుపైకి నెడుతోందని, దేశ భవిష్యత్తును కాలరాస్తుందన్నారు. కార్యక్రమంలో దార్ల వీరభద్రరావు, గడ్డం వరలక్ష్మి, తాతపూడి చిన్నారి, నక్క గంగ, రాజాల రాజమ్మ, గుర్రాల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

● అమరవీరులకు జోహార్లు

ప్రత్తిపాడు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): భరత మాత దాస్య సుంకలాల నుంచి విముక్తి చేయడానికి దేశం కోసం తమ ప్రాణాలర్పించిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవులకు పలువురు బీజేపీ నాయకులు నివాళులర్పించారు. సహిద్ దినస్ సందర్భంగా ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో మండలంలోని రౌతుపాలెంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు కొల్లా శ్రీనివాస్, కందా వీరాస్వామి మాట్లాడుతూ దేశం కోసం బ్రిటీష్ వారిని గడగడలాడించి ఉరికొయ్యలను చిరునవ్వులతో స్వీకరించిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవుల దేశభక్తిని, జాతీయభావాలను యువత అలవరుచుకోవాలన్నారు. బీజేపీ నేత ఇంటి బాబూరావు, తదితరులు పాల్గొన్నారు. అలాగే ప్రత్తిపాడులోని లిబరేషన్ పార్టీ కార్యాలయం వద్ద భగత్ సింగ్ చిత్రపటానికి లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు రేచుకట్ల సింహాచలం, మానుకొండ లచ్చబాబు, ర్యాలీ సత్యనారాయణ, ఇరటాపు శ్రీను నివాళులర్పించారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.



రౌతులపాలెంలో నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు



ప్రత్తిపాడులో భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

హెల్మెట్‌తో ప్రాణాలకు రక్షణ

తునిరూరల్, మార్చి23 (ఆంధ్రజ్యోతి):హెల్మెట్ తప్పనిసరని పట్టణ సీఐ గీతా రామకృష్ణ అన్నారు. గురు న్యూరో మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, రోటరీక్లబ్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు.

ఏలేశ్వరం: స్థానిక లారీ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో భగత్‌సింగ్, గురు, సుఖ్‌దేవ్ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. సీపీఎం మండల కార్యదర్శి పాకలపాటి సోమరాజు నేతృత్వంలో అమరవీరుల చిత్రపటానికి నివాళులర్పించారు. సీఐటీయు నాయకులు పిల్ల రాంబాబు, దంగేటి వేణుబాబు, కడలి సత్యనారాయణ, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



ఏలేశ్వరంలో ...

విజయవంతంగా ఉల్లాస్ పరీక్ష



ఉల్లాస్ పరీక్ష రాస్తున్న అభ్యాసకులు

తొండంగి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సంఘాల్లో నిరుద్యోగులను గుర్తించి వారికి వలంటీర్ల ద్వారా చదవడం రాయడంతో పాటు గణిత అంశాలపై ఉల్లాస్ పేరుతో ఆదివారం పరీక్ష నిర్వహించారు. వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో మండలంలో 800 మంది అభ్యాసకులు నమోదు కాగా వాళ్లకు ఆయా గ్రామాల్లో పరీక్ష నిర్వహించారు. వెలుగు ఏపీఎం సత్తిబాబు ఆధ్వర్యంలో సీసీలు, వీవోలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పరిశీలకులుగా హాజరయ్యారు.

సత్యదేవుడికి వేడుకగా రథోత్సవం



రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

అన్నవరం, మార్చి23 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి వాసుడు సత్యదేవుడికి వారాంతపు ఆర్జిత సేవయిన రథోత్సవం ఆదివారం వేడుకగా జరిగింది. స్వామి, అమ్మవార్లను రథంపై ఆశీనులను చేసి పండితుల ప్రత్యేక పూజలు అనంతరం ముమ్మారు ప్రదక్షిణ గావించారు. అనంతరం హారతులిచ్చి తిరిగి ప్రధానాలయానికి తీసుకెళ్లారు. భక్తులు పాల్గొన్నారు.

మండుతున్న ఎండలు



ధర్మవరం సెంటర్ వద్ద నిర్మానుష్యంగా మారిన హైవే

ప్రత్తిపాడు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): వేసవి ప్రారంభంలోనే ఎండలు మండుతుండడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. గడిచిన కొన్ని రోజులుగా ఎండ తీవ్రత అధికమవడంతో ప్రజలు నానాఅవస్థలు పడుతున్నారు. ఆదివారం భానుడు భగభగ మండుతుండంతో ప్రత్తిపాడు జాతీయ రహదారి నిర్మానుషంగా మారింది. అలాగే మండల రహదారులు ఎండ తీవ్రతకు వాహన రాకపోకలు తగ్గాయి. వడగాల్పులు మొదలు కావడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు.

ఉప్పలపాడులో గడ్డివాము దగ్ధం



దగ్ధమవుతున్న గడ్డివాము

గండేపల్లి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పలపాడులో ఆదివారం గట్టి గోవిందుకు సంబంధించిన గడ్డివాము దగ్ధమైంది. స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. గడ్డివాము పక్కనే పూరిపాకలు ఉండడంతో స్థానికులు భయాందోళన చెందారు. అయితే అగ్నిమాపక సిబ్బంది సకాలంలో వచ్చి మంటలను అదుపు చేయడంతో ఊపిరి పీల్చుకున్నారు. అధికారులు తక్షణమే స్పందించి ప్రభుత్వం నుంచి పరిహారాన్ని ఇప్పించాలని పలువురు కోరుతున్నారు.

కొనసాగుతున్న ఆర్టీసీ కార్మికుల నిరసన



ఏలేశ్వరంలో నిరసన తెలుపుతున్న ఆర్టీసీ ఉద్యోగులు

ఏలేశ్వరం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ డ్రైవర్ ఎస్వీ రమణను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ ఆదివారం కూడా కార్మికులు ఆందోళన చేశారు. జేఏసీ నేతృత్వంలో వారు రిలే నిరాహార దీక్షలు కొనసాగించారు. ఎంప్లాయిస్ యూనియన్, యునైటెడ్ యూనియన్ సభ్యులు డిపో గేటు వద్ద భోజన విరామంలో ఎర్ర రిబ్బన్లు ధరించి ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఆయన్ను విధుల్లోకి తీసుకునే వరకు ఉద్యమం కొనసాగిస్తామన్నారు. యూనియన్ డిపో కార్యదర్శి యుబిఎం కుమార్, యునైటెడ్ ఎంప్లాయిస్ యూనియన్ డిపో కార్యదర్శి ఎస్‌వీ రావు, త్రిమూర్తులు, కార్మికులు పాల్గొన్నారు.

అడవి రాజులుబాబు గుడికి పోటెత్తిన భక్తులు

రౌతులపూడి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఎమ్.కొత్తూరు గ్రామంలోనున్న అడవిరాజులు బాబు ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆదివారం కావడంతో ఉదయం నుంచే ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. కుటుంబ సభ్యులతో వచ్చి రాజులుబాబును దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఆలయ ఆవరణలోని మామిడి తోటల్లో వంటా-వార్పు చేసుకుని సహపంక్తి భోజనాలు చేశారు. రౌతులపూడి ఎస్‌ఐ వెంకటేశ్వరరావు నలుగురు కానిస్టేబుళ్లతో బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యా ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేయండి



కాగడాలతో ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం

జగ్గంపేట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): భగత్‌సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి సందర్భంగా జగ్గంపేట సెంటర్‌లో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కాగడాల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ (విజృంభణ) రాష్ట్ర కార్యదర్శి సతీష్ మాట్లాడుతూ భారత స్వతంత్రం కోసం అలుపెరగని పోరాటం చేసి, అతి చిన్న వయసులోనే ఉరికంబం ఎక్కిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా ప్రకటించకపోవడం దురదృష్టకరమని అన్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం నూతన విద్యా విధానం పేరుతో విద్యను కాసాయికరణం చేస్తూ కాలేజీలో, యూనివర్సిటీలో మత గొడవలు సృష్టిస్తూ విధ్వంసాలకు గురి చేస్తోందన్నారు. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ ప్రాణత్యాగం ఈ దేశ యువత, విద్యార్థులు, ప్రజలు మరవకూడదని, వాళ్ల పోరాటస్ఫూర్తితో ముందుకు పోవాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు కుంచే అంజిబాబు, ఏపీ రైతు కూలీ సంఘం జిల్లా నాయకుడు కర్నాకుల రామలింగేశ్వరరావు, దేశెట్టి సురేష్, డాను శ్రీను, బల్ల సోమరాజు, జాన్ బాబు, వెంకటేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

వాసవీసత్రం అధ్యక్షుడిగా గాంధీ నియామకం



వాసవీసత్రం అధ్యక్షుడు పేరూరి గాంధీని అభినందిస్తున్న కమిటీ సభ్యులు

అన్నవరం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ఆర్యవైశ్య భక్తులకు వసతి ఉచిత అన్నదానం కల్పించాలనే ఉద్దేశ్యంతో ఏర్పాటుచేసిన వాసవీ ఆర్యవైశ్య నిత్యాన్నసత్ర సమాజం అధ్యక్షుడిగా పేరూరి గాంధీ నియమితులయ్యారు. సంస్థ గౌరవాధ్యక్షుడు చక్కా తాతబాబు అధ్యక్షతన ఆదివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో గాంధీతో పాటు కార్యదర్శిగా రేపాక రామసత్యనారాయణ, కోశాధికారిగా తల్లం సత్యారావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా గాంధీని పలువురు అభినందించారు.

సారా నిర్మూలనలో భాగస్వాములు కావాలి



ప్రత్తిపాడులో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్

ప్రత్తిపాడు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): సారా నిర్మూలనలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని కాకినాడ జిల్లా ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ వి.రేణుక పిలుపునిచ్చారు. మండలంలోని పెద్దిపాలెం, పెదశంకర్లపూడి, వేములపాలెం గ్రామాల్లో నవోదయ కార్యక్రమంలో భాగంగా సారా నిర్మూలన అవగాహన సమావేశాలు నిర్వహించారు. సారా నిర్మూలన ఆవశ్యకతను సూపరింటెండెంట్ కె.జయమౌనిక వివరించారు. ఎక్సైజ్ సీఐ పి.శివప్రసాద్, ఎస్‌ఐ పి.వంశీరామ్, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

నేడు వెంకటేశ్వరస్వామి దేవస్థానం వార్షికోత్సవం

తుని రూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఎస్.సూరవరం గ్రామంలోనున్న వెంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని వైభవంగా జరిపేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ ధర్మకర్త చింతమనీడి నాగ సోమ రాజు ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలతో పాటు అన్నసమారాధన ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. దీనికి మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు తదితరులు హాజరుకానున్నారని తెలిపారు.

రక్తదాన శిబిరం



ఈవో సుబ్బారావుకు మొక్కను అందజేస్తున్న సంకల్పం సభ్యులు

అన్నవరం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): భరత స్వాతంత్ర్య సంగ్రామంలో కీలక ఘట్టమైన భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజుగురులు రక్తంచిందించిన రోజు సందర్భంగా సంకల్పం చేయూత వింగ్ ఆధ్వర్యంలో సత్యదేవ ఉచిత వైద్యశాలలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 64మంది దాతలు రక్తదానం చేసినట్టు సంస్థ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఈవో సుబ్బారావును సంకల్పం సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో సభ్యులు యడ్ల వరప్రసాద్, మహేంద్రవాడ జగదీష్, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి శనివారం నిరసన

జగ్గంపేట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): పుష్కర ఎత్తిపోతల పథకం వద్ద ప్రతి శనివారం నిరసన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి మరోతి శివగణేష్ తెలిపారు. తాళ్లూరు ఎత్తిపోతల పథకానికి నిధులను విడుదల చేయించి, మరమ్మతులు చేయించాలని డిమాండ్ చేస్తూ ఈ నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలియజేశారు. కార్యక్రమంలో తాళ్లూరు ఎత్తిపోతల పథక పరిధిలోని రైతులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

యనమల పరామర్శ



వి. కొత్తూరు మాజీ సర్పంచ్ భర్తను పరామర్శిస్తున్న యనమల

తుని రూరల్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన వి.కొత్తూరు మాజీ సర్పంచ్ భర్త తమరాన రామకృష్ణను మాజీమంత్రి యనమల రామకృష్ణుడు, మాజీఎమ్మెల్యే అశోక్‌బాబుతో కలిసి పరామర్శించారు. వారి వెంట టీడీపీ నాయకుడు తాండవ షుగర్స్ మాజీచైర్మన్ ఎస్.లోవరాజు, చింతమనీడి నాగ సోమరాజు, ఇనిగంటి సత్యనారాయణ, తమరాన సత్యనారాయణ, జక్కన రామనాయుడు, ఎ.వెంకటరమణ, తదితరులు, ఉన్నారు. అలాగే వి.కొత్తూరులో కృష్ణాలయ వార్షికోత్సవానికి మాజీమంత్రి యనమల ముఖ్య అతిథిగా హాజరై పూజలు చేశారు. ఆయనకు తాండవ షుగర్స్ మాజీ చైర్మన్ లోవరాజు స్వాగతం పలికారు.. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబు, తదితరులు ఉన్నారు.

ప్రమాదపుటంచున ప్రయాణం

● పట్టించుకోని అధికారులు

శంఖవరం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా శంఖవరం నుంచి రౌతులపూడి వెళ్లే దారిలో ప్రయాణించాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. మండల కేంద్రమైన శంఖవరంలో ఈ దుస్థితి మరీ దారుణంగా ఉందని వారంటున్నారు. పదుల సంఖ్యలో మలుపులు ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం వస్తుందోనని వారు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడున్న కల్వర్టులకు గోడలు లేకపోగా, కనీసం హెచ్చరిక బోర్డులు కూడా ఎక్కడా కనిపించవని వారు వ్యాఖ్యానిస్తున్నారు. మరోవైపు మైనింగ్ లారీలు మితిమీరిన వేగంతో దూసుకొస్తుంటే భయపడాల్సిన పరిస్థితులు తలెత్తుతున్నాయని వారంటున్నారు. దీనిపై అధికార యంత్రాంగం దృష్టిసారించి ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని వారు కోరుతున్నారు.



శంఖవరంలో ప్రమాదంగా ఉన్న కల్వర్టు